

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 25.0

ఎడతెరపి లేని వర్షాలు

ఏలూరు సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనం కారణంగా జిల్లాలో గురువారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటల్లో జంగారెడ్డిగూడెం మండలంలో 12.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కుక్కునూరు 9.6, వేలేరుపాడు 6.2, ఆగిరిపల్లి 6.2, పోలవరం 6.2, జీలుగుమిల్లి 4.8, నూజివీడు 3.8, కైకలూరు 2.4, కామవరపుకోట 2.2, టి.నరసాపురం 2.2, చాట్రాయి 1.8, బుట్టాయి గూడెం 1.2, కొయ్యలగూడెం 0.8, మండవల్లి 0.6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. జోరుగా కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

ఆక్వా రైతుల్లో ఆందోళన



మట్టగుంటలో హడావిడిగా చేపలు పట్టుబడి

కలిదిండి: భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. చేపలు, రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించడంతో పాటు తెగుళ్ల సోకే ప్రమాదం ఉండడంతో చెరువుల్లో నిరంతరాయంగా ఏరియేటర్లను తిప్పుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి వైరస్ సోకి రొయ్యలు మృత్యువాత పడడంతో లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. రొయ్యల ధర పెరిగినప్పటికీ కౌంటుకు వచ్చిన రొయ్యలు ప్రస్తుతం తక్కువగా ఉన్నాయి. పలు గ్రామాల్లో చెరువుల్లో ఆక్సిజన్ లోపించి చిన్న సైజు రొయ్యలు చనిపోతుండడంతో హడావిడిగా పట్టుబడి చేస్తున్నారు. కొంతమంది రైతులు పెద్ద సైజు చేపలను హడావిడిగా పట్టుబడి చేస్తున్నారు.

యూరియాను దారి మళ్లిస్తే చర్యలు



ఏలూరుసిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): యూరియాను వ్యవసాయ పనులకు కాకుండా ఇతర పనులకు దారి మళ్లిస్తే దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పరిమితికి మించి ఎరువుల వినియోగం వల్ల తలెత్తే సమస్యలపై రైతులకు అవగాహన కల్పించి రైతులను చైతన్య పరిచి నానో ఎరువులను ప్రోత్సహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఎరువుల తయారీదారులు, హోల్‌సేల్, రిటైల్ డీలర్లు, వ్యవసాయ, సహకార, మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ తదితర అధికారులతో గురువారం జిల్లా స్థాయి సమీక్ష జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అవసరమైనన్ని ఎరువులను సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు నిల్వలను తెలిపే రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా, మార్క్‌ఫెడ్ డీఎం ప్రసాద్ గుప్తా, డీసీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన మేర రుణ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ వెట్రిసెల్వి డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, ఉపాధి యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలపై కలెక్టరేట్ నుంచి డీఆర్‌డీఏ ఏపీఎంలు, కమ్యూనిటీ కో- ఆర్డినేటర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు.
- పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పీ- 4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలు ఎంపిక, దత్తత తీసుకునేందుకు మార్గదర్శకుల జాబితాలను రూపొందిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వివరించారు. సచివాలయం నుంచి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో పీ-4 కార్యక్రమంపై విజయానంద్ సమీక్షించారు.

తొలివిడత డీఎడ్ ప్రవేశాల్లో 99 మందికి సీట్లు కేటాయింపు

ఏలూరు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ విద్య శిక్షణ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించిన డీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు తొలివిడత సీట్ల కేటాయింపు, అడ్మిషన్లకు ధ్రువపత్రాలను గురువారం అందజేసినట్టు దూబచర్ల డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి తెలిపారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 17నుంచి గురువారం వరకు జరిగిందని, చివరి రోజున 99 మందికి సీట్లు కేటాయించగా, 56 మందికి ప్రవేశపత్రాలను జారీ చేసినట్టు వివరించారు. కౌన్సెలింగ్ నిర్వహణలో సీనియర్ అధ్యాపకులు రామసుబ్రహ్మణ్యం, రాజ్‌కుమార్, సరోజిని, గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

రైతుకు దక్కని భరోసా!

రైతు సేవా కేంద్రాల్లో అరకొర సేవలు



శనివారపుపేటలో నిరుపయోగంగా ఉన్న రైతు భరోసా కేంద్రం

- పేరు మారినా పనితీరు మారలేదు
- అన్నిచోట్ల పాత వాసనలే గుప్పుమంటున్నాయి
- పగటి వేళల్లోనే తాళాలు దర్శనం
- పర్యవేక్షణ ఎప్పుడో గాలికొదిలేశారు
- రైతులకు సేవలు లేనేలేవు
- అప్పుడు, ఇప్పుడూ అంతా ఒకటే

ఆంధ్రజ్యోతి విజిట్

అన్నదాతకు అండగా.. ఏది కావాలన్న క్షణాల్లో సమకూర్చేందుకు అప్పట్లో రైతు భరోసా కేంద్రాలన్నారు. మీకు ఏ కష్టం రాదు. రైతు ప్రభుత్వం మాదంటూ గొప్పలు చెప్పారు. ఎరువులు, పురుగుల మందుల నుంచి ఏది కావాలన్న సరే ఇట్టే మీ ముందు వాలిపోతాయంటూ కూనిరాగాలు తీశారు. నాటి వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసిన రైతు భరోసా కేంద్రాలన్నీ అరకొరగానే పనిచేశాయి. కొన్నింటికి సొంత భవనాలు, మరి కొన్నింటికి అద్దె భవనాలు. సిబ్బంది చూస్తే అరకొర. ప్రత్యక్ష పర్యవేక్షణ అంతకంటే లేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భరోసా కేంద్రాల పేరుమారి రైతుసేవా కేంద్రాలయ్యాయి. అప్పటికి ఇప్పటికీ వీటి పనితీరులో మార్పు రానేలేదు. జిల్లాలో గురువారం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో సేవా కేంద్రాల డొల్లతనం కనిపించింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లావ్యాప్తంగా 2020లోనే రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు దిశగా సుమారు 520 కేంద్రాలను ప్రతిపాదించారు. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి దీంట్లో సగానికి సగం 226 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు సమకూర్చారు. ఈ కేంద్రాల నిర్వహణకు వీలుగా అప్పటికప్పుడు సిబ్బందిని నియమించడం లేదా సర్దుబాటుకు ప్రయత్నించారు. ఎరువులు, పురుగుమందులు అందుతున్నాయా లేదా, సరిపడినంత నిల్వలు అందుబాటులో ఉంటున్నాయా, రైతుల కోసం దగ్గరుండి సలహాలు ఇస్తున్నారా, ఈ -పంట నమోదు సవ్యంగా సాగుతుందా అంటూ తెగ హైరానా పడిపోయేవారు. కానీ క్షేత్రస్థాయిలో చాలా కేంద్రాల్లో ఈ తరహా సేవలేవి రైతులకు అందేవికావు. పంట నమోదు వివరాల దగ్గర్నుంచి మిగతా సేవా కార్యక్రమాలు అన్నిచోట్ల అమలే కాలేదు. ప్రత్యక్ష పర్యవేక్షణ దాదాపు అన్నిచోట్ల ఆనాడు, ప్రస్తుతం లోపించింది. వ్యవసాయ ఆధారిత జిల్లాలో శరవేగంగా ఏ పంటలు ఏ తరహా పద్ధతిలో వేస్తే అత్యధిక దిగుబడి వస్తుందో, ఏయే పంటలకు అనువైన బీమా సౌకర్యం వర్తిస్తుందో, కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి పథకాలు రైతు ఎలా వినియోగించుకోవాలో, ఆటంకాలను అధిగమించాలో ఒక పద్ధతి వివరించలేక భరోసా కేంద్రాలు కాస్త చతికిలపడ్డాయి. నిత్యం రైతులకు అందుబాటులో ఉండాల్సిన ఈ కేంద్రాలు కాస్త ఉదయం వేళల్లోనే తాళాలు వేలాడి కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల దగ్గర్నుంచి స్థానిక నేతలు, సంబంధిత అధికారులు ఈ కేంద్రాలను గాలికొదిలేశారు. ఫలితంగా వీటి పర్యవేక్షణ పూర్తిగా దెబ్బతింది. అన్నదాతకు సాయం కంటే భారంగానే మారాయి ఈ సెంటర్లు.



గుర్వాయిపాలెంలో నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం

కొన్నిచోట్ల భవనాలపై రైతు భరోసా కేంద్రాలుగానే పేర్లు ఉండడం గమనార్హం.

- **కలిదిండి :** మండలంలో రైతు భరోసా కేంద్రాల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. మొత్తం 20 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. భాస్కరావుపేట రైతు భరోసా కేంద్రంలో మాత్రమే ఒకే ఒక్క వ్యవసాయ గ్రామ సహాయకుడు ఉన్నారు. మిగిలిన 19 కేంద్రాల్లో సిబ్బంది లేక తలుపులకు తాళాలు వేసి ఉన్నాయి. ఎరువులు, పురుగు మందులు పంపిణీ జరగడం లేదు. ఈ కేంద్రాలపై పర్యవేక్షణ లేదు. కలిదిండి వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఒక్కరే ఉన్నారు.
- **ఏలూరు రూరల్ :** ఏలూరు రూరల్ మండలం 18 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం చొదిమెళ్ళ, సుంకరవారి తోట, మల్కాపురం, జాలిపూడి, మాదేపల్లి, రైతు సేవా కేంద్రాల్లో సేవలు కొనసాగుతున్నాయి. ఉన్న ఈ కొద్దిపాటి కేంద్రాలు రైతులకు ఏమాత్రం భరోసా ఇవ్వడం లేదు. విత్తనాలు అందుబాటులో లేక అన్నదాతలు ప్రైవేటు వ్యాపారులకు ఆశ్రయించాల్సి వస్తోంది. ఇటీవల రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఇటీవల క్రమబద్ధీకరణ చేశారు. అయితే (మిగతా 8వ పేజీలో)



మూసిఉన్న రామన్నగూడెం రైతు భరోసా కేంద్రం

- **లింగపాలెం :** మండలంలో 17 రైతుసేవా కేంద్రాలున్నాయి. పూర్తిస్థాయిలో సిబ్బం ది ఉన్నా రైతులకు పురుగుమందులు, ఎరువులు అందుబాటులో లేక ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల్లో రైతుసేవాకేంద్రాల భవనాలు పూర్తవ్వగా ఆసన్నగూడెంలో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించడంతో అక్కడికి వెళ్లేందుకు అధికారులు, రైతులు వెనకడుగు వేస్తున్నారు. రంగాపురం, కొత్తపల్లి, కలరాయనగూడెం, టీసీహెచ్‌ఆర్ పాలెం గ్రామాల్లో నిర్మాణాలను అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ఇతర ప్రభుత్వ భవనాల్లోని ఇరుకు గదుల్లోనే నిర్వహిస్తున్నారు.

- **చాట్రాయి :** మండలంలో 16 రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు సేవలు కొంతవరకు సక్రమంగానే అందుతున్నాయి. ఎనిమిది కేంద్రాలు సొంత భవనాలలో పని చేస్తుండగా, ఐదు కేంద్రాలు పీఏసీఎస్‌లు ఇతర ప్రభుత్వ భవనాల్లో, మూడు కేంద్రాలు అద్దె భవనాలలో పని చేస్తున్నాయి. ఇంకా ఎనిమిది సొంత భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. పది మంది వీఏఏలు, ముగ్గురు వీహెచ్‌ఏలు, ముగ్గురు ఎంపీహెచ్‌వోలు మొత్తం 16 మంది సిబ్బంది ఉండగా, ప్రతి కేంద్రానికి ఒక్కరు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది కొరత లేదు. ఈ కేంద్రాల్లో ఎరువులు పురుగు మందులు అమ్మడం లేదు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు ఉదయం సాయంత్రం హాజరు వేయాల్సి ఉన్నందున సమయ పాలన కాస్తా బాగానే ఉంది వ్యవసాయాధికారి బి.శివశంకర్ నిత్యం రైతుసేవా కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు.

- **ద్వారకాతిరుమల :** మండలంలో 18 రైతు భరోసా కేంద్రాలుండగా ఐదు కేంద్రాలు తప్ప మిగిలినవి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గుణ్ణంపల్లి, నారాయణపురం, పి.కన్నాపురం, ఎం.నాగులపల్లి, తిరుమలంపాలెం-1,2, పంగిడిగూడెం-1, 2, తిమ్మాపురం, రాళ్లకుంట, జాజులకుంట, దొరసానిపాడు, రామన్నగూడెం, గుండుగొలనుకుంట, జి.కొత్తపల్లి, సీహెచ్ పోతేపల్లి, రామసింగవరం, ఐఎస్ రాఘవాపురంలో అలంకారప్రాయంగా ఈ కేంద్రాలు సాగుతున్నాయి. ఎరువులు, పురుగుల మందులు అందడం లేదు. దొరసానిపాడు, గుణ్ణంపల్లి, నారాయణపురం, ఎం.నాగులపల్లి, తిరుమలంపాలెంల్లో సొంత భవనాల్లో కేంద్రాలున్నాయి. అద్దె భవనంలో ఉన్న రామన్నగూడెం భరోసా కేంద్రం ఎప్పుడూ మూసే ఉంటుందని, తిమ్మాపురంలో పాత సినిమా హాలులో ఏర్పాటు చేసిన కేంద్రంతో తమకు ఒరగబెట్టిందేమీ లేదని రైతులు చెబుతున్నారు. ఎం.నాగులపల్లిలో హార్టికల్చర్ అసిస్టెంట్ గతేడాది సస్పెండైనా ఇంత వరకూ ఆ పోస్టు భర్తీ కాలేదు.

పాస్ పుస్తకాలపై రాజముద్ర


- జగన్ బొమ్మ తొలగింపు
- జిల్లాకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు



కలెక్టరేట్‌లో పట్టాదారు పాస్ పుస్తకాలను కట్టలు కడుతున్న వీఆర్వోలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రైతులకు ప్రభుత్వ రాజముద్ర ముద్రించిన భూయాజమాన్య హక్కు పత్రాలు (పట్టాదారు పాస్ పుస్తకాలు) అందనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు చేసిందేమి లేకపోయినా.. ప్రచార ఆర్భాటాలతో రైతులకిచ్చే పాస్ పుస్తకాలపై అత్యుత్సాహంతో జగన్ బొమ్మతో ముద్రించి కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం చేశారు. రైతు పొందే హక్కు పత్రాలపై జగనన్న భూరక్ష పథకం కింద అంటూ ముద్రించి మరీ పంపిణీ చేశారు. అయితే టీడీపీ ప్రభుత్వం వాటికి చెక్ పెడుతూ పాత విధానం ప్రకారమే రాజముద్రతో పాస్ పుస్తకాలు ముద్రించి అందించాలని ఆదేశాలను జారీ చేసింది. తాజాగా ఆగస్టు నాటికి రాష్ట్రంలో రైతులందరికీ తొలి విడతగా 21.86 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో అందించాలని సీఎం చంద్రబాబు ఇటీవల జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయించారు. జిల్లాలో మ్యుటేషన్లు పూర్తయిన భూములకు సంబంధించి ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన 22,670 పట్టాదారు పుస్తకాలు కలెక్టరేట్‌కు గురువారం చేరుకున్నాయి. ఆర్డీవోల పర్యవేక్షణలో తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది గ్రామాల వారీగా వచ్చిన పుస్తకాలను కట్టలు కట్టుకుని తీసుకెళ్తున్నారు. తప్పులకు తావు లేకుండా ఎల్‌పీఎంలు, అన్ని వివరాలతో పాస్‌పుస్తకాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వీటిని త్వరలోనే అందివ్వనున్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద రెండు విడ తలుగా చేపట్టి భూముల రీ సర్వేకు సంబంధించి కూడా పట్టాదార్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. దీనికి ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలను జేసీ, తహసీల్దార్ లాగిన్‌లతో నూతన పట్టాదారు పుస్తకాలకు కసర త్తులు జరుగుతున్నాయి. మరోవైపు జాయింట్ ఎల్‌పీఎంల సమస్యలను ఒక కొలిక్కి తేవడంతో రైతులు పథకాల లబ్ధిని అందుకోనున్నారు.



నేడు.. నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇలా
నాడు.. జగన్ బొమ్మతో అలా..

చించినాడ బ్రిడ్జిపై భారీ వాహనాలు బంద్

ఉమ్మడి గోదావరి జిల్లాల వారధికి మరమ్మతులు

- తేలికపాటి వాహనాల రాకపోకలకు మాత్రమే అనుమతి
- వివిధ మార్గాలకు వాహనాల మళ్లింపు
- అధికారులతో 'కోనసీమ' కలెక్టర్ చర్చలు

ఉచిత ప్రైవేటు విద్య

ఫీజుల చెల్లింపులపై మార్గదర్శకాలు విడుదల

స్నానానికి కాలువలో దిగి..

కొట్టుకుపోయిన వృద్ధుడు

■ లోపలి పేజీలో..

ఇంజనీరింగ్ అదరహో

ఏ బ్రాంచైనా ఓకే.. సీట్ల భర్తీలో విద్యార్థుల ఆసక్తి

- ఆరు కళాశాలల్లో 99 శాతం.. నాలుగు కళాశాలల్లో 92 శాతం పైగా భర్తీ
- కన్వీనర్ కోటాలో 9,336 సీట్లకు 8,416 కేటాయింపు.. మేనేజ్‌మెంట్ కోటాలోనూ గిరాకీ
- సెకండ్ కౌన్సెలింగ్‌లో మిగిలిన కాలేజీల్లో పెరిగే ఛాన్స్.. పదేళ్ల తర్వాత ఇంజనీరింగ్ హవా

(భీమవరం రూరల్-ఆంధ్రజ్యోతి)

ఇంజనీరింగ్ సీట్లు భర్తీలో గత ఏడాది అంతకుముందు సంవత్సరాలలో మూడు, నాలుగు కళాశాలల్లో మాత్రమే పూర్తి స్థాయిలో అన్ని కోర్సులలో సీట్లు భర్తీ అవుతూ వచ్చాయి. మిగిలిన కళాశాలల్లో 80 శాతంలోపు మాత్రమే సరిపెట్టుకున్నాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో ఆరు కళాశాలల్లో పూర్తి స్థాయి సీట్లు నిండాయి. నాలుగు కళాశాలల్లో 94 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. రెండు కళాశాలల్లో 74 శాతం పైగా సీట్లు ఫిల్ అయ్యాయి. మిగిలిన రెండు కళాశాలల్లో మాత్రమే 20 శాతంలోపు సీట్లతో సరిపెట్టుకున్నాయి.

పెరిగిన సీట్లు

పదేళ్ళుగా ఇంజనీరింగ్ సీట్ల భర్తీ వెనుకబడుతూ వచ్చింది. ఉన్న కళాశాలలు తగ్గిపోతూ వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో గతం లో 28 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండేవి. అవి ఇప్పుడు 14 కళాశాలలకు చేరాయి. అయితే సీట్ల సంఖ్య మాత్రం పెరుగుతూ వచ్చింది. 2024లో సీట్ల సంఖ్య పెరిగింది. దానికి తగ్గట్లుగా సీట్ల భర్తీ కొంచెం పర్వాలేదనిపించింది. ఈ ఏడాది కన్వీనర్, మేనేజ్‌మెంట్ రెండూ కలిపి 12,900 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కన్వీనర్ కోటా 1100 సీట్ల వరకు పెరిగాయి. ఏపీ ఈఏపీ సెట్ 2025లో 11,739 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అదే ఇప్పుడు సీట్లు భర్తీ పెరగడానికి కారణంగా నిలిచింది. రెండో కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లు చాలా వరకు నిండే అవకాశం ఉంది.

మేనేజ్‌మెంట్ చేరికల్లోనూ స్పీడ్

ప్రతి ఏడాదికంటే ఈ సారి ఇంజనీరింగ్‌లో మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీలో స్పీడు పెరిగింది. సీటు రేటు పెరిగింది. ప్రధాన కళాశాలల్లో సీఎస్ఈ కోర్సు సీటు రూ.16 లక్షలకుపైనే పలికిం ది. మిగిలిన కోర్సు రూ.14 లక్షలకు పైగా చెల్లింపులు జరిగాయి. ప్రధాన కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్లు పూర్తిగా భర్తీ అయ్యాయి. ఈసారి మేనేజ్‌మెంట్ సీట్ల సంఖ్య 3,870 చేరింది.

కళాశాలల వారీ సీట్ల భర్తీ ఇలా..

	సీట్లు	భర్తీ అయినవి	శాతం
1. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల	1,248	1,232	99
2. సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల	912	899	99
3. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	864	853	99
3. శశి ఇంజనీరింగ్ కళాశాల	840	829	99
4. వాసవి ఇంజనీరింగ్ కళాశాల	768	757	99
5. విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల	720	711	99
6. స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల	1,200	1,140	95
7. ఆర్‌పీసీఈ కళాశాల	624	594	95
8. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల	552	518	94
10.భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	336	308	92
11.ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల	432	340	79
12.డబ్ల్యుఐఎస్ఐ (నల్లజర్ల)	168	128	76
13.ఐఎస్‌టీఎస్ఓసీ కళాశాల,జంగారెడ్డిగూడెం	384	78	20
14.హెచ్ఐటీఈ కళాశాల	288	29	10

ఇంజనీరింగ్ విద్యపై విద్యార్థులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో సీట్ల భర్తీ అదేస్థాయిలో కొనసాగుతోంది. దాదాపు పదేళ్ల తర్వాత కళాశాలల్లో జోష్ కనిపించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 16 ఇంజనీరింగ్ కళాశాలలు వున్నాయి. మొత్తం కన్వీనర్ కోటా సీట్లు 9,336 కాగా, మొదటి విడత కౌన్సెలింగ్‌లో 8,416 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 920 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. ఇందులో రెండు కళాశాలల్లోనే 565 సీట్లు కాగా, మిగిలిన కళాశాలల్లో 365 ఉన్నాయి. సెకండ్ కౌన్సెలింగ్‌లో ఇవి చాలా వరకు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

అన్ని కోర్సులపై మక్కువ

ఇంజనీరింగ్‌లో గతంలో మాదిరి కాకుం డా ఈ సారి అన్ని కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపారు. దీంతో ఎప్పు డూ వెనుకంజలో ఉండే ఈఈఈ, మెకానికల్ కోర్సులు సీట్ల భర్తీలో పోటీగా నిలిచా యి. సీఎస్ఈ, ఏఐఅండ్ఎంఎల్, ఏఐడీ ఎస్, ఐటీ కోర్సులు వాటి హవా కొనసాగించాయి. ఈసీఈ, సీఈ కోర్సు సీట్లు బాగా భర్తీ అయ్యాయి. సాఫ్ట్‌వేర్ వైపే కాకుండా ఇతర కోర్సుల్లోనూ విద్యార్థులు మక్కువ చూపిస్తున్నారు. బ్రాంచ్ ఏదైనా పర్వాలేదు. సీటొస్తే చాలని భావిస్తున్నారు.

క్యాంపస్ ఎంపికలో వెనుకబాటు

ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంలో మూడేళ్లుగా వెనుకబడుతూ వస్తున్నారు. క్యాంపస్ ఎంపికలు గతంతో పోలిస్తే 60 శాతం తగ్గాయి. గడిచిన విద్యా సంవత్సరంలో కొంచెం మెరుగనిపించింది. ఏటా 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ పూర్తిచేసి వస్తుంటే వీరిలో 20 శాతంలోపే ఉద్యోగాలు అందుకుంటున్నారు. అయితే ఇంజనీరింగ్ కోర్సుపైనే విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులలో 60 శాతం పైగా విద్యార్థులు ఇంజనీరింగ్‌కి వెళ్తున్నారు. ఇది చాలా మంచి పరిణామమని యాజమాన్యాలు భావిస్తున్నాయి.

ఎంహెచ్‌వో ఎప్పుడొస్తారో..?

- ఏడాదిగా పోస్టు ఖాళీ !
- శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులపై పర్యవేక్షణ కరువు
- నగరంలో పెరుగుతున్న అపారిశుధ్యం



ఏలూరు టూటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో పారిశుధ్య విభాగం అతి ముఖ్యమైంది. ఒకపూట చెత్త ఎత్తకపోయిన దుర్గంధం తాండవిస్తుంది. పారిశుధ్య పనులను పర్యవేక్షణలో మునిసిపల్ హెల్త్ అధికారి పాత్ర కీలకం. ఏలూరు నగరపాలక సంస్థలో మూడు లక్షలకు పైగా ప్రజలు నివసి స్తున్నారు. ప్రతీరోజు 105 మెట్రిక్ టన్నుల చెత్త నగరంలో తయారవుతుంది. దాదాపు 800 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తుంటారు. వీరందరిని పర్యవేక్షించే ఎంహెచ్‌వో పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంటోంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులను పర్యవేక్షించే అధికారి లేక ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అడిషనల్ కమిషనర్ చంద్రయ్యను ఎంహెచ్‌వో ఇన్‌చార్జ్‌గా నియమించి వన్‌టౌన్ పరిధిలో, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డికి టూటౌన్ పరిధిలో పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అయితే వీరిద్దరు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉండడంతో తెల్లవారు జామున పారిశుధ్య పనులు పర్య వేక్షించడానికి వీలుకావడం లేదు. ఫోన్ ద్వారా పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్నారు. ఇదే అదనుగా పారిశుధ్య విభాగం సిబ్బంది ఇష్టానుసారంగా పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నారు.

కారణాలేమిటి..?

పదకొండు నెలల క్రితం ఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మాలతిని విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఎంహెచ్‌వో పోస్టు ఖాళీగానే ఉంది. అసలు ఎంహెచ్‌వో పోస్టు ఎందుకు ఖాళీగా ఉంది..? ఎవరూ ఆసక్తి చూపడం లేదా..? ఆసక్తి చూపకపోతే కారణాలేమిటి.. వంటి అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కమిషనర్ దగ్గర నుంచి హెల్త్ ఆఫీసర్ వరకు నియమకాలు జరగాలంటే ప్రజాప్రతినిధుల అనుమతి తప్పనిసరి. మరోవైపు హెల్త్ ఆఫీసర్ పోస్టుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని హెల్త్ అధికారిని నియమించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

హెల్త్ అధికారిని నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం. నగరంలో ఎటువంటి అపారిశుధ్యం లేదు. ఉదయం, తెల్లవారు జామున నేనే స్వయంగా వీధుల్లోకి వెళ్లి పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నా.

\- ఎ.భానుప్రతాప్, కమిషనర్



చికెన్ అమ్మకాలపై ఆషాఢం, శ్రావణం ఎఫెక్ట్

తణుకు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్న దశలో ఆషాఢం, శ్రావణ మాసాలు వరుసగా చికెన్ అమ్మకాలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనులలో బీజీగా వుండటంతో చికెన్ కొనుగోళ్లపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో పౌల్ట్రీ పరిశ్రమలో సంభవించిన బర్డ్ ఫ్లూ కారణంగా లక్షలాది కోళ్ల చనిపోవడంతో వాటి ప్రభావం చికెన్ అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీనితో చికెన్, చికెన్ పదార్థాల వినియోగాన్ని కొంత కాలం పాటు నిలిపి వేయాలని స్థానిక అధికారులు ప్రజలకు సూచించారు. దీనితో సుమారు రెండు నెలల పాటు చికెన్ అమ్మకాలు నిలిచిపోవడంతో చికెన్ కోసం ప్రత్యేకంగా కోళ్లను పెంచే హేచరీలలో కూడా కోళ్ల పెంపకానికి విరామం ప్రకటించాయి. ఫలితంగా అనంతర కాలంలో చికెన్ ధరలు క్రమ, క్రమంగా కిలో రూ. 300 వరకూ పెరిగాయి. నెల రోజులుగా ఆషాడం కొనసాగడం, వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపట్టడంతో రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనులలో బీజీగా మారిపోవడంతో చికెన్ అమ్మకాలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. గత రెండు వారాలుగా కిలో చికెన్ లైవ్ రూ. 110, స్కిన్‌తో రూ. 160, స్కిన్ లెస్ రూ. 180 అమ్మకాలు జరుగు తున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బెంగాల్ మనకంటే 15 నుంచి 20 రోజుల ముందుగానే శ్రావణ మాసం ప్రారంభం కావడంతో అక్కడ అమ్మకాలు నిలిచిపోయాయి. ఎగుమతులు నిలిచిపోవడంతో చికెన్ ధరలు తగ్గుతున్నాయని చెబుతున్నారు. ఏది ఏమైనా ఆషాడం, శ్రావణ మాసాలు చికెన్ అమ్మకాలకు ఇబ్బందిగానే వుంటుందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

శుభ కార్యాలు లేకపోవడంతోనే..



ఆషాఢ మాసంలో పెళ్లిళ్ల వంటి శుభ కార్యక్రమాలు లేకపోవడంతో చికెన్ ధర తగ్గితుంది. ఇది ప్రతీ సంవత్సరం ఎలా వున్నా ఈ ఏడాది ఎక్కువగా వుంది. ఆషాడం నెలతో పాటు శ్రావణ మాసం కూడా చికెన్ అమ్మకాలు తక్కువగానే వుంటాయి. దీంతో గడిచిన నెలంతా అమ్మకాలు మందకొడిగానే సాగాయి. శ్రావణ మాసం కాబట్టి ఈ నెల కూడా ఇదేవిధంగా ఉంటుంది .. తక్కువ ధరకే అమ్మకాలు వుంటాయి.

-యార్లగడ్డ ప్రసాద్, చికెన్ వ్యాపారి, తణుకు

ఆధ్యాత్మిక సందడి, భక్తి భరితమైన శ్రావణమాసం నేటి నుంచి ప్రారంభం కానున్నది. తెలుగు మాసాల్లో శ్రావణ మాసానికి ఎంతో విశిష్టత ఉంది. ఇది కేవలం పండుగల మాసమే కాదు.. పెళ్లిళ్లు, శుభకార్యాలకు సైతం విశిష్టమైనది. శ్రావణ మాసంలో అన్నీ శుభ ఘడియలే. శుభ కార్యాలు, వ్రతాలు, నోములు, పూజలకు ఎంతో పవిత్రమైనది. ఈరోజు నుంచి ప్రతీ ఇంటా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. మహిళలు పూజల్లో మునిగితేలుతారు..

సకల శుభాల శ్రావణం..

నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రవణా నక్షత్ర ప్రవేశంతో శ్రావణం నెలరోజుల పాటు భగవన్నామ స్మరణలతో తెలుగు లోగిళ్ల మారుమోగుతాయి. ఈ నెలలలో వర్షాలు పడుతుంటాయి. వ్యవసాయపనులు ఊపందుకుంటాయి. స్థితికారుడైన శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రం కావడంతో ఈ నెలలో వచ్చే శనివారాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అందుకే శ్రీవారి ఆలయాలు ఆయా రోజుల్లో భక్తజనులతో పోటెత్తుతాయి. తిదులతో సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణం ఒక్కటే. పౌర్ణమి చంద్రునితో కలవడంతో ఈ మాసం లక్ష్మీదేవికి కూడా ఎంతో ప్రీతిపాత్రమైనది. ఈమాసంలో శివయ్యను పూజిస్తారు. అభిషేకప్రియుడైన శివదేవుని ఆరాధిస్తే నవగ్రహాలు సైతం శాంతిస్తాయని పండితులు చెబుతున్నారు. ఆలయాలకు భక్తుల రాకను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా అన్ని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ద్వారకాతిరుమల క్షేత్రదేవతగా కొలువు దీరిన కుంకుళ్లమ్మ ఆలయం ముస్తాబవుతుంది. ఆషాడం వెళ్లిన తర్వాత శ్రావణమాసంలో కొత్తల్లుళ్ల అత్తారిళ్లకు వెళ్లడం ఆచారం. గడపకో కొబ్బరి కాయ కొట్టించి గడపలను దాటించడం ఆనవాయితీ..



వ్రతాలు, పూజలతో ఆధ్యాత్మిక సంబరం

పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు

శ్రావణంలో శుభముహూర్తాలివీ

శ్రావణమాసం రావడంతో ద్వారకాతిరుమల క్షేత్రంలో పెళ్లి సందడి మొదలైంది. ఆషాడం శూన్యమాసం కావడంతో కొద్ది రోజులుగా ముహూర్తాలు లేకపోవడంతో స్తబ్ధుగా ఉన్న జిల్లాలోని ఆలయాలు, కల్యాణమండపాలలో మళ్లీ భాజాబజంత్రీల మోతలు వినిపించనున్నాయి. ఎన్నో జంటలు మాంగల్య బంధంతో ఒక్కటి కానున్నాయి. ప్రధానంగా చినవెంకన్న క్షేత్రం పెళ్లిళ్లకు ముస్తాబవుతోంది. ఈ శ్రావణమాసంలో ప్రారంభమయ్యే జూలై నెలలో 26, 27, 29, 31 తో పాటు ఆగస్టు నెలలో 1, 3, 5,7,8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీల్లో మంచి ముహూర్తాలున్నట్లు పురోహితులు చెబుతున్నారు. ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 21 వరకూ భాద్రపదమాసం. ఇది శూన్యమాసం కాబట్టి ముహూర్తాలుండవు.

శ్రావణంలో అన్నీ పండుగలే

శ్రావణమాసం రాకకోసం మహిళలు ఎదురు చూస్తారనడంలో అతిశయోక్తి లేదు. ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రతీ శుక్రవారం మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలను ఆచరిస్తారు. సంతాన, సౌభాగ్యాల కోసం ప్రతీ మంగళవారం తమ ఇళ్ల వద్ద అమ్మవారిని పసుపుతో అలంకరించి మంగళగౌరీ వ్రతం ఆచరిస్తారు. మొలకలతో కూడిన పప్పు ధాన్యాలను వాయినంగా సమర్పిస్తారు. ఇక ఈ మాసంలో వచ్చేపౌర్ణమి ముందు అనగా ఆగస్టు 8న శుక్రవారానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ వారాన్నే వరలక్ష్మీ వ్రతంగా ఆచరిస్తారు. కొబ్బరికాయకు పసుపు పూసి అమ్మవారి ఆకారంలో తీర్చిదిద్ది, తమ వద్దనున్న బంగారు ఆభరణాలను అలంకరించి విశేష పూజలు చేస్తారు. ప్రసాదాలను స్వీకరించి చుట్టుపక్కల వారికి పంపిణీ చేస్తారు.

జూలై 29 మంగళవారం, నాగుల పంచమి, మంగళగౌరీ వ్రతం
ఆగస్టు 8 శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం, పుత్రదా ఏకాదశి
ఆగస్టు 9 శనివారం, రాఖీ పౌర్ణమి, హయగ్రీవ జయంతి
ఆగస్టు 16 శనివారం, శ్రీకృష్ణ జన్మాష్టమి
ఆగ23 శనివారం, పోలాల అమావాస్య

ఆగస్టు 23న శ్రావణ అమావాస్యతో ఈ మాసం ముగుస్తుంది. శ్రావణంలో వచ్చే ప్రతీ మంగళవారం మంగళగౌరి వ్రతాన్ని ఆచరిస్తారు. కొత్తగా పెళ్లైన మహిళలు మొదటి ఐదేళ్లపాటు ఈ వ్రతాన్ని ఆచరించాలని పండితులు చెబుతారు. ఈనెల 29 నుంచి శ్రావణ మంగళవారం ప్రారంభమవుతుంది.

ఆధ్యాత్మిక సంతృప్తి ఇచ్చేది శ్రావణమే



వివాహాది శుభకార్యాలు జరుగడంతో పాటు అన్ని రోజులూ దైవపూజకు, వ్రతాలకు అనుకూలమైనవే. అలాగే అమ్మవార్ల ఆలయాల్లో జరిగే విశేష పూజల్లో పాల్గొంటే శుభం కలుగుతుంది. ఈ మాసంలో లభించినంత ఆధ్యాత్మిక సంతృప్తి మరే నెలలోనూ దొరకదు.. సకల పాపాలు హరించేందుకు లింగాభిషేకాలు, గౌరీ వ్రతాలు జరపాలి. ఈ శ్రావణంలో వివాహాలకు దాదాపు 17 వరకూ మంచి ముహూర్తాలున్నాయి. ఆ తరువాత వచ్చే బాద్రపదం శూన్య మాసం. పెళ్లిళ్ల జరుగవు. అనంతరం సెప్టెంబరు 23 నుంచి శుభముహూర్తాలున్నాయి.

- గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ, పురోహితుడు, ద్వారకాతిరుమల



ఇక ఇది..కనుమరుగేనా..?

ఎన్నో ఏళ్లుగా కళాకారులకు ఆసరాగా బీవీఆర్ కళాకేంద్రం

కోర్టు ప్రాంగణం దారి కోసం ఖాళీ చేయాలని అధికారుల ఆదేశాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): దశాబ్ధాల కాలంగా ఎందరో కళాకారులకు వేదిక అది. ఎందరో ఆ కళా కేంద్రం వద్దే తమ కళను ప్రదర్శించి అరంగేట్రం చేశారు. ప్రస్తుతం ఆ కళాకేంద్రం ఉనికి ప్రశ్నార్థకం కానుంది. తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణానికి అనుకొని ఉన్న ఆఫీసర్స్ క్లబ్, బీవీఆర్ కళాకేంద్రాలు నెలాఖరులోగా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించడంతో తాడేపల్లిగూడెంలో కళాకారులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1930 సంవత్సరంలో కోర్టు ప్రాంగణం, ట్రెజరీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ట్రావెలర్స్ బంగ్లా ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో అ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు ఒక క్లబ్‌గా ఏర్పడి నిర్మించుకున్న ఆఫీసర్స్, దాతల సహకారంతో నిర్మించిన బీవీఆర్ కళాకేంద్రాలు జిల్లా కోర్టుకు దారి కోసం ఖాళీ చేయాలని అధికారులు ఇటీవల ఆదేశించారు. దీంతో ఏళ్ల తరబడి కళాకారులకు సేవలం దించిన కళాకేంద్రంతో పాటు ఆ నాటి అధికారుల ప్రోత్సాహంతో ఏర్పడిన ఆఫీసర్స్ క్లబ్ భవనాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోర్టు ప్రాంగణానికి దారి కోసం దశాబ్ధాల కాలంగా ఉన్న భవనాలను మాయం చేయొద్దని నిరుప యోగంగా ఉన్న గోదాముల పక్కనుంచి వెళితే ట్రావెలర్స్ బంగ్లా వైపు పెద్ద మార్గం ఉంటుం దని కళాకారులు ఆర్డీవో ఖానోకు, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబులకు వినతులు సమర్పించారు.

కళాకేంద్రం ఏర్పడింది ఇలా

కళలకు ఎంతో ప్రాధాన్యం ఉన్న సమయంలో 1994 సంవత్సరంలో కళాకారులకు సరైన వేదిక లేదని గుర్తించి ఎందరో ప్రముఖులు కళావేదిక ఏర్పాటుకు సన్నాహాలు చేశారు.కళా పరిషత్ చైర్మన్ బుద్ధాల రామారావు తన వంతుగా భారీ విరాళం ఇవ్వడంతో కళావేదిక నిర్మితమైంది. ఆ నాటి నుంచి ప్రతీ ఏటా ఉగాది ఉత్సవాలు, సాంస్కృ తిక కార్యక్రమాలు, రంగస్థల కళాకారుల ప్రదర్శనలు తరచూ ఇక్కడ జరుగుతున్నాయి. కళాకారుల జీవితాలతో పెనవేసుకుపోయిన ఈ కళావేదిక కనుమరుగైతే కళా ప్రియులకు తీవ్ర నిరాశే.

వీటిని పరిరక్షించాలి



మూడు దశాబ్ధాల క్రితం ఏర్పాటు చేసిన కళాకేంద్రం, వందేళ్ల క్రితం నిర్మించిన ఆఫీసర్స్ క్లబ్ కోర్టు దారికోసం తొలగించా లనుకోవడం చాలా బాధాకరం. అందరికీ అందుబాటులో ఉండే ఈ భవనాలను ప్రభుత్వం ప్రత్యేకంగా భావించి వాటిని పరిరక్షించాలి. కోర్టు ప్రాంగణం కోసం ప్రభుత్వం తలచుకుంటే మరో మార్గం ఉంది.

బుద్ధాల వెంకట రామారావు, రాష్ట్ర కళా పరిషత్ చైర్మన్

ఎమ్మెల్యే బాధ్యత తీసుకోవాలి



ఎందరో కళాకారులకు కళాకేంద్రం ఓనమాలు నేర్పింది. ప్రస్తుతం ఆ కళా కేంద్రం ఉనికి ప్రశ్నార్థకంగా ఉండటం బాధాకరం. కళాకారులను దృష్టిలో పెట్టుకుని కళా కేంద్రాన్ని పరిరక్షించేందుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ బాధ్యత తీసుకోవాలి.

తమ్మినేని కృష్ణారావు, కళాకారుడు



రాష్ట్రస్థాయి పోటీలకు మండపాక విద్యార్థులు ఎంపిక

తణుకు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 26, 27 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి రన్నింగ్, స్విమ్మింగ్, షూటింగ్ పోటీలకు తణుకు రూరల్ మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె.ఫణిశ్రీ తెలిపారు. గురువారం తణుకు రూరల్ మండలం తేతలిలోని స్టెప్పింగ్ స్టోన్ స్కూల్‌లో జరిగిన ట్రయతలాన్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 17 విభాగంలో ఎస్.గణేష్, అండర్-15 విభాగంలో కె.కిరణ్, ఎస్.రోహిత్, జీ.రమేష్, అండర్-13 విభాగంలో జీ.ఆనంద శ్రీనివాస్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు సూర్యనారాయణలను గ్రామ సర్పంచ్ జానా వెంకటలక్ష్మీ, మండల టీడీపీ అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, ఉప సర్పంచ్ నగేష్, జనసేన నాయకుడు ఎస్ఎంసీ చైర్మన్ గూడూరి మహాలక్ష్మీ, జానా శ్రీనివాసు తదితరులు అభినందించారు.

జాతీయ స్థాయిలో పతకాల పంట

ఒలింపిక్స్‌లో ఆడటమే లక్ష్యం



ఆకుల త్రిలోక్

తణుకు పట్టణానికి చెందిన ఆకుల త్రిలోక్ భవిష్యత్‌లో ఒలింపిక్స్‌లో ఆడాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నాడు. తణుకులోని ప్రవేటు కళాశాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇప్పటి వరకు గుజరాత్ రాష్ట్రంలోని వడోదర నగరంలో 67వ నేషనల్ స్కూల్‌గేమ్స్, అండర్ 17 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నందు రజత పతకం సాధించాడు. మదనపల్లిలో రాష్ట్రస్థాయి అండర్ 14 బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం, నెల్లూరులోని జరిగిన అండర్ 17 స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించాడు.

వరల్డ్ ఛాంపియన్ లక్ష్యం



మానే మనోజ్ఞ

తణకు పట్టణానికి చెందిన మానే మనోజ్ఞ ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. విజయవాడలో ఆల్ ఇండియా అండర్ 15 నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో రజిత పతకం, మదనపల్లిలో జరిగిన అండర్ 14 స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలలో బాలికల సింగిల్స్ విభాగంలో బంగారు పతకం, విశాఖపట్టణంలో అండర్ 15 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రజిత పతకం, భీమవరంలో జరిగిన అండర్ 13లో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బ్రౌంజ్ మెడల్ సాధించాడు.. భవిష్యత్‌లో వరల్డ్ చాంపియన్ అవ్వాలని తన లక్ష్యమని చెప్పింది.

బ్యాడ్మింటన్ పోటీలలో తణుకు క్రీడాకారుల సత్తా

తణుకు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తణుకు చిట్టూరి సుబ్బారావు, గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ చెందిన పలువురు క్రీడాకారులు జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి అంతర్జాతీయ వేదికలపై తణుకు కీర్తి ప్రతిష్ఠలు నిలబెడుతున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడాకారులను వెలికి తీయాలనే లక్ష్యంతో ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ప్రాంగణంలో కళాశాల వ్యవస్థాపకుడు చిట్టూరి సుబ్బారావు బ్యాడ్మింటన్ అకాడమీని స్థాపించారు. ఈ అకాడమీ ద్వారా వేలాది మంది క్రీడాకారులు శిక్షణ పొంది జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటారు. ఇదే అకాడమీ నుంచి ఇటీవల నలుగురు క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు.

ఉత్తమ క్రీడాకారుడిగా ఎదగాలి



చల్లా విజయ్ చరణ్

ఇరగవరం గ్రామానికి చెందిన చల్లా విజయ చరణ్ ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువు తున్నాడు ఇప్పటి వరకు గోవాలో జరిగిన ఆల్ ఇండియా అండర్- 15 నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బ్రౌంజ్ మెడల్, మలికిపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించాడు. భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారుడిగా కావాలనుకుంటున్నట్టు చరణ్ చెప్పాడు

భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలి



పతకాలతో సమ్మెట్ల హేమంత్

తణుకు పట్టణానికి చెందిన సమ్మెట్ల హేమంత్ వివేకానంద గ్లోబల్ స్కూలులో పదో తరగతి చదువుతున్నాడు. ఇప్పటి వరకు అండర్ 15 బాలుర విభాగంలో ఆల్ ఇండియా నెం1 ర్యాంకర్, ఆల్ ఇండియా నేషనల్ బ్యాడ్మిం టన్ చాంపియన్ షిప్‌లో రాష్ట్రం తరుపున పాల్గొని తొమ్మిది బంగారు, ఆరు రజత, ఐదు కాంస్య పతకాలు సాధించాడు. గత సంవత్సరం చైనాలో ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలలో ఇండియా టీమ్ ప్రాబబుల్స్‌కు ఎంపిక, జైపూర్, గోవా, బెంగుళూరులో జరిగిన ఆల్ ఇండియా నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలలో మూడు సార్లు అండర్ 15 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం సాధించి హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సొంతం చేసుకున్నాడు. ఒడిశాలో జరిగిన 35 సబ్ జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో డబుల్స్‌లో బంగారు పతకం, సింగిల్స్‌లో కాంస్యం సాధించాడు. బిహార్‌లో ఆల్ ఇండియా అండర్ 13 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బంగారు పతకం, ఒడిశాలో అండర్ 13 నేషనల్ టోర్నమెంట్‌లో సింగిల్స్ డబుల్స్‌లో బంగారు పతకాలు, ముంబయిలో ఆల్ ఇండియా అండర్ 13లో డబుల్స్ విభాగంలో రజిత పతకం సాధించాడు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే తన ముందున్న లక్ష్యమని దానికి అనుగుణంగా కృషి చేస్తున్నట్టు హేమంత్ చెప్పాడు.

ఆట పాటలతో అభ్యసనం



లింగపాలెం మండలం కె.గోకవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న కార్యకర్త

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకట్టుకున్న బోధన

అత్తిలి/లింగపాలెం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారుల్లో సృజనాత్మకత విద్యను అందించేందుకు, వారిని మరింత చైతన్యం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. జాతీయ విద్యావిధానం -2020 బాల్య సంరక్షణ విద్యకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళా శిశు సంక్షేమశాఖ సహకారంతో అంగన్ వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ప్రత్యేక బోధన చేపట్టనున్నారు. నవచేతన, ఆధార్ శిలపేరుతో కొత్తగా రెండు అభ్యసన పుస్తకాలు (హ్యాండ్ బుక్స్) ముద్రించారు. ప్రాథమిక స్థాయిలోనే చిన్నారులకు విద్య పట్ల మంచి పునాది పడాలనే ఉద్దేశ్యంతో వీటిని రూపొందించారు. అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేశారు. వీటిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రీప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ -2 పుస్తకాలను చిన్నారులకు అందజేశారు. మూడేళ్ళుదాటిన పిల్లలకు ఆంగ్లం, గణితం, తెలుగు ఇలా అన్ని అంశాలు సులభంగా చదువుకునేలా వారికి అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రూపొందించారు.



మెదడు, శరీర అభివృద్ధికి 'చేతన'

నవ చేతన పుస్తకంలో శిశువు గురించి వివరించారు. తల్లి గర్భదారణ దశ నుంచి శిశువు తన శారీరక, మానసిక ప్రేరణ అవసరాన్ని తెలియజేస్తుంది. దీన్ని గుర్తించి చిన్నారుల మెదడు, శరీర అభివృద్ధిని గుణాత్మకంగా పెంచేందుకు తల్లిదండ్రులు, సంరక్షకులు, అంగన్ వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఇందులో సూచించారు. నేను నా కుటుంబ శరీర భాగాలు, ఆహారం రుచులు తదితర అంశాలు పొందుపరిచారు. మూడేళ్ళ లోపు వారికి వీటి గురించి చెప్పి వారి తల్లిదండ్రులకు వివరించేలా సూచిస్తారు. పిల్లల్లో విషయ పరిజ్ఞానం పెంపొం దించే కబుర్లు, కథలు ఎలా చెప్పాలన్నది చిత్రాలతో సహా తెలియజేశారు.

ఆధార్ శిలతో వినోదాత్మకంగా బోధన

ఆధార్ శిలతో వినోదాత్మకంగా కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్లలోపు వయసు వారందరికి ఆటపాటలతో వినోదాత్మకంగా బోధన సాగించే అంశాల గురించి ఆధార్ శిల పుస్తకంలో వివరించారు. నీతి పద్యాలు, రుతువులు, పండుగలు, పండ్లు, కూరగాయలు మన ఊరు కుటుంబ తదితర ఇతి వృంత్తాంతాల ద్వారా పిల్లలు పరిసరాలు, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి దోహదపడేలా ఇందులో పలు అంశాలు పొందుపరిచారు. పుస్తకాలలో ఉన్న అంశాలను చిన్నారులు, తల్లిదండ్రులకు ఎలా వివరించాలో కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వీటితో పాటు శారీరక, మానసిక ఆరోగ్య పెరుగుదల వంటివి వారికి వివరిస్తారు. వీటి ద్వారా చిన్నారులలో బాల్యం నుంచే వారిలో చైతన్యం కలిగించేలా రాష్ట్రప్రభుత్వం అడుగులు వేస్తోంది.



చిన్నారుల సమగ్రాభివృద్ధికి దోహదం

చిన్నారులలో సృజనాత్మకత, ఆలోచనాశక్తి, శ్రద్ధ, బాల్యదశ నుంచే అన్ని విధాలుగా ఎదిగేందుకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయి. ఏలూరు జిల్లాలో పది ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో మొత్తం 2,226 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఉన్న 23,499 మంది చిన్నారులకు నవచేతన, ఆధార్‌శిల పుస్తకాలను అందించాం. ఈ పుస్తకాలు చిన్నారుల భవిష్యత్‌కు, సమగ్రాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ తాయి. ఈ పుస్తకాలలో ఉన్న అంశాలను చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు ఎలా వివరించాలో జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం.

- పి.శారద, ఐసీడీఎస్ పీడీ, ఏలూరు జిల్లా



కోమటిగుంటలో మైక్రో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కోమటిగుంటలో అభివృద్ధి పనులు ప్రారంభం

కాళ్ళ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసిన కోమటగుంట గ్రామాన్ని ప్రతి గ్రామం ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్‌కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం కోమటిగుంటలో మైక్రో వాటర్ ప్లాంట్, గ్రామ సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ సొంత నిధులు రూ. 5 లక్షలతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌తో కూడిన పార్కును ప్రారంభించారు. ఉప సర్పంచ్ వేగిరెడ్డి లక్ష్మి, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, డీసీ చైర్మన్‌లు గోకరాజు వెంకట శివరామరాజు, తోట పణిబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఏలేటిపాడులో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక : ఎమ్మెల్యే ఆరిమిల్లి

ఇరగవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో ఇళ్ళస్థలాలు ఇస్తామని లబ్ధిదారుల నుంచి వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఇరగవరం మండలం అయితంపూడి, పేకేరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంగా అందుతున్న సంక్షేమం, అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు రాబోయే రోజుల్లో పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు అందజేయాలని ఇప్పటికే చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని ఇందుకు సంబంధించి లబ్ధిదారుల జాబితాలను తయారు చేస్తున్నామన్నారు. సంక్షేమాన్ని ప్రణాళిక ప్రకారం అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. అయింతపూడి, పేకేరు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టామన్నారు.నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు.

మావుళ్లమ్మను దర్శించుకున్న కలెక్టర్ నాగరాణి



భీమవరంటౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాతృమూర్తితో కలిసి గురువారం మావుళ్లమ్మను దర్శించుకున్నారు. కలెక్టర్‌కు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ స్వాగతం పలికారు. ఆలయ ప్రధా నార్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, కలెక్టర్‌కు ఆశీర్వచనం అందించారు. ఈవో అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ హరిప్రకాష్, శక్తీశ్వరస్వామి ఆలయ ఈవో రామకృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

వశిష్ఠ గోదావరికి అఖండ హారతి



నరసాపురం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వలంధరరేవులో గురువారం రాత్రి వీహెచ్‌పీ, భజరంగ్‌దల్ ఆధ్వర్యంలో వశిష్ఠ గోదావరికి అఖండ హారతి ఇచ్చారు. కాశీలో ఏవిధంగా హారతి ఇస్తారో అదే రితీలో గోదావరికి దూప, దీప, కుంభ, పంచ హారతులు ఇచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు వలంధర్ రేవుకు వచ్చారు. శృంగవృక్షం దత్తపీఠం దత్త నాగనంద్ సరస్వతి స్వామిజీ ప్రవచనాలు చేశారు. విద్యా ఉపాసకులు అరుణానందస్వామి గోదావరికి హారతి ఇచ్చారు. బొమ్మిడి సునీత, బీజేపీ నాయకులు, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాటన్ విగ్రహానికి పూలమాల వేసిన కోళ్ల నాగేశ్వరరావు తదితరులు

అపర భగీరథుడు కాటన్

భీమవరం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : గోదావరి ప్రజల గుండెల్లో సర్ ఆర్థర్ కాటన్ చిరంజీవిగా నిలిచిపోయారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. భీమవరం రెస్ట్ హౌస్ రోడ్డులోని కాటన్ విగ్రహం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం కాటన్ వర్ధంతి నిర్వహించారు. చెరుకువాడ రంగసాయి, కేజీఆర్‌ఎల్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మురళి మోహన్, ప్రసాద్, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలుగు కవి గుర్రం జాషువాకు నివాళులు

భీమవరం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తెలుగుకవి గుర్రం జాషువా సమాజంలోని సామాజిక రుగ్మతలను తన కలంతో ఎదుర్కొన్నారని కళారంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్ అన్నారు. పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం జాషువా వర్ధంతి నిర్వహించారు. కళాకారుల సంఘం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, భట్టిప్రోలు శ్రీనివాసరావు ప్రజానాట్య మండలి నాయకుడు మల్లుల సీతారామ్ పాల్గొన్నారు.

మలేషియాలో కొడుకు జాడ లేదు..

» క్రైండ్‌నెస్ సొసైటీని ఆశ్రయించిన తల్లిదండ్రులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): బతుకు తెరువు కోసం మూడేళ్ల క్రితం మలేషియా వెళ్లిన యువకుడి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోవాలని అతడు విదేశంలో పనికి వెళ్లాడు. తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా కొడుకు పట్టుబట్టడంతో కాదనలేకపోయారు. మూడేళ్ల నుంచి కుమారుడు డబ్బులు పంపడంతో పనికిలో కుదురుకున్నాడని సంతోషపడ్డారు. ఇటీవల అతడి నుంచి ఏ సమాచారం లేకపోవడంతో అల్లాడిపోతున్నారు.

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం ఉప్పాకపాడుకు చెందిన గొల్లకూటి శ్రీనివాసరావు, తల్లి లక్ష్మి దంపతులు అప్పుచేసి కొడుకు వీరబాబును మలేషియా పంపించారు. అక్కడ పామాయిల్ తోటల్లో పనిచేస్తూ మూడేళ్లుగా తల్లిదండ్రులకు డబ్బులు పంపించేవాడు. రెండు నెలల క్రితం తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడిన వీరబాబు తరువాత ఫోన్ చేయడం మానేశాడు. ఏం జరిగిందో తెలియక తల్లడిల్లిపోయారు. కొడుక్కి ఏం జరిగిందో తెలియక ఆందోళనలో ఉన్నారు. చివరికి తమ కొడుకును ఏదో కేసులో పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పడంతో ఏం జరిగిందో తెలియక అయోమయంలో ఉన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఆశ్రయించగా ఆయన క్రైండ్‌నెస్ సొసైటి అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావును సహాయం చేయాలని కోరారు. గొల్లకూటి శ్రీనివాస్, లక్ష్మి గట్టిం మాణిక్యాలరావుకు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. అంబసి అధికారులకు పాస్‌పోర్ట్, ఇతర సమాచారం ఇచ్చి జాడ తెలుసుకుని వీరబాబును రప్పించే ఏర్పాటు చేస్తామన్నారు.



మాణిక్యాలరావుకు వినతిపత్రం అందిస్తున్న వీరబాబు తల్లిదండ్రులు

చించినాడ బ్రిడ్జిపై భారీ వాహనాలు బంద్

ఉమ్మడి గోదావరి జిల్లాల వారధికి మరమ్మతులు

» తేలికపాటి వాహనాల రాకపోకలకు మాత్రమే అనుమతి

» వివిధ మార్గాలకు వాహనాల మళ్లింపు

» అధికారులతో 'కోనసీమ' కలెక్టర్ చర్చలు



చించినాడ బ్రిడ్జిపై వాహన రాకపోకల నియంత్రణ బోర్డు

అమలాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ వశిష్ఠ నదిపై దిండి-చించినాడ బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. బ్రిడ్జి మరమ్మతుల కారణంగా భారీ వాహనాను మళ్లిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తేలికపాటి వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. 216 జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా దిండి-చించినాడ మధ్య 1995లో నిర్మించిన ఈ వారధికి అత్యవసర మరమ్మతులు చేయాల్సి ఉంది. ఈ కారణంగా వాహనాలను వివిధ ప్రాంతాల గుండా మళ్లించినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం ప్రకటించారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, రోడ్డు రవాణాశాఖ అధికారులు, ఆర్టీసీ, జాతీయ రహదారులశాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గురువారం నుంచి వారధిపై భారీ వాహనాల రాకపోకలను మళ్లిస్తున్నట్టు ప్రకటించారు. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ సూచనలతో ఈ వారధిపై అత్యవసర మరమ్మతులు చేపట్టాల్సిన దృష్ట్యా ఆ పనులు పూర్తి అయ్యే వరకు భారీ వాహనాలను మళ్లిస్తామని తెలిపారు. లైట్ వెయిట్ వెహికల్స్ మాత్రం గరిష్ఠంగా గంటకు 30కిలోమీటర్ల వేగంతో ప్రయాణించడానికి అనుమతి ఉందని, మిగిలిన అన్ని వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాల్సిందిగా కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, ఆర్టీసీ ఆర్ఎం రాఘవశ్రీనివాస్, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ సాయిశ్రీనివాస్, ఏఈ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు మళ్లింపు ఇలా..

- కాకినాడ నుంచి నరసాపురం - భీమవరం వైపు వెళ్లే వాహనాలు రావులపాలెం వంతెన మీదుగా సిద్ధాంతం నుంచి వెళ్లాలి.
- కాకినాడ, రామచంద్రపురం, మండపేట నుంచి వాహనాలు రావులపాలెం-సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నరసాపురం, భీమవరం వెళ్లాలి.
- అమలాపురం నుంచి నరసాపురం, భీమవరం వైపు వాహనాలు అమలాపురం, కొత్తపేట, రావులపాలెం, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నరసాపురం, భీమవరం వెళ్లాలి.
- తాటిపాక, రాజోలు నుంచి నరసాపురం వైపు వాహనాలు తాటిపాక, పి.గన్నవరం, ఈతకోట, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నరసాపురం, భీమవరం చేరుకోవాలి.
- యానాం నుంచి పాలకొల్లువైపు వాహనాలు ద్రాక్షారామం, రావులపాలెం, సిద్ధాంతం మీదుగా పాలకొల్లు, నరసాపురం, భీమవరం వెళ్లాలి.
- నరసాపురం నుంచి రాజోలు వైపు వాహనాలు దిగమర్రు, పాలకొల్లు, సిద్ధాంతం, రావులపాలెం మీదుగా రాజోలు చేరుకోవాలి.

ఉచిత ప్రైవేటు విద్య

ఫీజుల చెల్లింపులపై మార్గదర్శకాలు విడుదల

ఏలూరు అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం 12(1)సి కింద ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఖర్చులను చెల్లించేందుకు ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలను విడుదల చేసింది. విద్యార్థులకు బోధనా ఖర్చులను ప్రైవేటు పాఠశాలలకు చెల్లించేందుకు ఐదు కేటగిరీలుగా విభజించి, స్టార్ రేటింగ్ ప్రకారం రీయింబర్స్ చేయాలని నిర్ణయించారు. వన్ స్టార్ పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.8,500 సంబంధిత ప్రైవేటు పాఠశాలకు ప్రభుత్వం చెల్లిస్తుంది. 2 స్టార్ పాఠశాలలకు రూ.10వేలు, 3 స్టార్ పాఠశాలకు రూ.11,500, 4 స్టార్లకు రూ.13వేలు, 5 స్టార్ పాఠశాలలకు రూ.14,500 చొప్పున సెప్టెంబరు, జనవరిలో రెండు విడతలుగా స్కూలు బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఏలూరు జిల్లాలో 164 ప్రైవేటు పాఠశాలల్లో తొలివిడత 392 మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించగా 286 మంది చేరారు. తుది విడతలో 134మందికి సీట్లు కేటాయించగా 80 మంది చేరారు. ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతిలోకి 25శాతం సీట్లకు ఉచిత అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించిన నాలుగేళ్లలో తొలి సంవత్సరం 2022-23లో 83మంది విద్యార్థులకు సీట్లను కేటాయించినప్పటికీ 55 మంది చేరగా, 2023-24లో 497మందికి 338మంది, 2024-25లో 723మంది విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు కల్పించడానికి సీట్లు ఖరారు చేసినప్పటికీ 526 మంది చేరడం గమనార్హం. ఇక తాజాగా జారీ అయిన మార్గదర్శకాల ప్రకారం ప్రైవేటు పాఠశాలలకు స్టార్ రేటింగ్‌ను ఖరారు చేయాల్సిఉంది.

ఈ ఏడాది భారీగా తగ్గుదల..!

ప్రైవేటు పాఠశాలల్లో 12(1)సి కింద సీట్లు ఖరారైనప్పటికీ సంబంధిత యాజమాన్యాలు చేర్చుకునేందుకు నిరాకరిస్తున్నాయని వస్తోన్న ఆరోపణలు, ఫిర్యాదులు వస్తుండగా, క్షేత్రస్థాయిలో అడ్మిషన్ల తీరును పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు మరోలా ఉన్నాయి. కొన్నిచోట్ల యాజమాన్యాలు అడ్మిషన్లకు నిరాకరిస్తున్నా నేరుగా డీఈవో, సమగ్రశిక్ష జిల్లా అధికారులు, ఎంఈవోలు జోక్యం చేసుకుని సంబంధిత విద్యార్థులను చేర్చుకునేలా ఒప్పిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 526మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించగా, 366 మంది చేరారు. ఈ ఏడాది నుంచి కుటుంబంలో ఎంతమంది విద్యార్థులున్నా వారందరికీ తల్లికి వందనం ఆర్థికసాయం కింద ఒక్కొక్కరికి రూ.13వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. ప్రైవేటు పాఠశాలల్లో 12(1)సి కింద ఉచిత అడ్మిషన్ తీసుకుంటే తల్లికి వందనం వర్తించదని పలువురు తల్లితండ్రులు ఉచిత సీట్లకు వెనుకంజ వేసినట్టు సమాచారం. ఇంకొందరైతే తల్లికి వందనం డబ్బులతో తమకు నచ్చిన ప్రైవేటు పాఠశాలలో చేర్చుకోవడానికి ఇష్టపడుతున్నట్టు చెబుతున్నారు. ఉచిత అడ్మిషన్ల కింద పాఠశాలలో చేర్చినా పాఠ్య పుస్తకాలు, స్కూలు యూనిఫాం, ఇతర విద్యా సంబంధిత సామగ్రి రూపేణా రూ. వేలల్లోనే చెల్లించాల్సి రావడం అదనపు భారంగా భావించి పలువురు ఉచిత సీట్లను వదులుకుంటున్నారని తెలుస్తోంది.

స్నానానికి కాలువలో దిగి..

నీటి ఉధృతికి కొట్టుకుపోయిన వృద్ధుడు

ముదినేపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్నానం చేయడానికి కాలువలో దిగిన వృద్ధుడు నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. కాకరవాడ గ్రామంలో గురువారం ఉదయం మృతి చెందిన ఒక మహిళ దహన సంస్కారాల అనంతరం కుటుంబ సభ్యులంతా పక్కనే పంట కాలువలో స్నానానికి వెళ్లారు. వారితో పాటు అదే గ్రామానికి చెందిన మరీదు వెంకటేశ్వరరావు (62) కాలువలోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకు పోయాడు. వర్షాల వల్ల కాల్వలో నీటి ప్రవాహం గట్ల అంచులను తాకుతూ ప్రవహిస్తుండడంతో ఆ వృద్ధుడిని రక్షించేందకు అవకాశం లేకుండా పోయింది. అతడి ఆచూకీ కోసం కాల్వ వెంబడి గురువారం రాత్రి వరకు గాలించారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌ఐ విఎస్ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు చెల్లించండి

ఏలూరు టూటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు వాటిని తిరిగి చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2015-19 సంవత్సరాల్లో వివిధ పథకాల ద్వారా రుణాలు పొందినవారు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రుణాలు తీసుకున్నవారికి హామీగా సంతకాలు పెట్టిన ఉద్యోగుల జీతాల నుంచి రికవరి చేస్తామన్నారు. ప్రభుత్వం రుణాల వసూళ్లపై అధికారులకు టార్గెట్‌లు విధించిందన్నారు. ప్రతీ నెల రూ.64లక్షలు రికవరి లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లబ్ధిదారులు ఎస్‌బీఐ ఖాతాలో నేరుగా లేదా డీడీ తీసి ఎస్సీ కార్పొరేషన్‌కు సమర్పించాలన్నారు. రుణాలు చెల్లించని వారి యూనిట్లను సీజ్ చేస్తామన్నారు. బకాయిలు చెల్లిస్తే కొత్తవారికి ప్రభుత్వం రుణాలు ఇస్తుందన్నారు.

ముప్పవరంలో లారీ నుంచి పడి కూలీ మృతి



మృతి చెందిన నాగరాజు

దెందులూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కూలి పనులు ముగించుకుని లారీపై ఇంటికి వెళ్తున్న వ్యక్తి అదే లారీ నుంచి కిందపడి మృతి చెం దాడు. ముప్పవరం పరిధిలోని గుండుగోలను గ్రామానికి చెందిన కరణం నాగరాజు(43) ఒక ఫ్యాక్టరీలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం పనులు ముగించుకుని లారీపై వస్తుండగా ప్రమాద వశాత్తు జారి పడి మృతి చెందాడు. దీనిపై దెందులూరు ఎస్.ఐ. శివాజీ కేసు నమోదు చేశారు.

పాముకాటుతో ముగ్గురు రైతులకు అస్వస్థత

పోలవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పాము కాటుతో వేర్వేరు చోట్ల ముగ్గురు రైతులు అస్వస్థతకు గురైన ఘటన పోలవరం మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.కృష్ణంరాజు పర్యవేక్షణలో వీరికి వైద్యం అందిస్తున్నారు. పోలవరం పంచాయతీ కొత్తరామయ్యపేట గ్రామానికి చెందిన రైతులు మేడూరి ఏడుకొండలు అనే రైతులు, సుంకర అవతారం, ఇటుకలకోట పంచాయతీ కొత్తపైడిపాక గ్రామానికి చెందిన యంగల రాజేశ్ రైతు కూలీగా పొలంలో పనిచేస్తుండగా వేర్వేరు చోట్ల వీరిని పాములు కాటు వేశాయి.అస్వస్థతకు గురైన ముగ్గురినీ పోలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా విరుగుడు ఇంజెక్షన్లు ఇచ్చి పర్యవేక్షణలో ఉంచారు. వర్షాకాలంలో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు విషసర్పాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాము కరిచిన వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని వైద్యుడు కృష్ణంరాజు సూచించారు.

ఇంటి తాళం పగలగొట్టి నగదు, వెండి చోరీ



జంగారెడ్డిగూడెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటిని దొంగలు లూటీ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ ఇంట్లోకి బుధవారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి బీరువాలు పగలగొట్టి వెండి వస్తువులు, రూ.20 వేల నగదు, ల్యాప్ టాప్ కాజేసినట్టు బాధితుడు కె.శ్రీకాంత్ తెలిపారు. శ్రీకాంత్ పట్టణంలోని శేషాద్రి నగర్‌లో అద్దెకు నివాసముంటున్నారు. ఈ నెల 20న ఇంటికి తాళం వేసి తన కుటుంబంతో పాటు హైదరాబాద్ వెళ్లారు. తిరిగి 24వ తేదీ గురువారం ఉదయం ఇంటికి వచ్చే సరికే ఇంటి తాళం పగలగొట్టి రెండు బీరువాలను తెరచి వాటిలో ఉన్న వస్తువులు, నగదు దోచుకెళ్లారు. శ్రీకాంత్ ఇంటి పక్క యజమాని సీసీ కెమేరా పరిశీలించగా బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చినట్లు గమనించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీకాంత్ తెలిపారు.

మేకలు మేపేందుకు వెళ్లి ఒకరి మృతి

చింతలపూడి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇంట్లో శుభకార్యం కోసం కొనుగోలు చేసిన మేకలను మేపడానికి వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిగూడెంలో గురువారం చోటు చేసుకుంది. త్వరలో ఇంట్లో నిర్వహించే ఓ శుభకార్యం కోసం భూక్యా బాలు(45) మేకలను కొనుగోలు చేశాడు. వాటిని ఇంటి సమీపంలో మేపడానికి వెళ్లగా ఫెన్సింగ్‌పై విద్యుత్ వైరు పడింది. ఇది గమనించక ఫెన్సింగ్ వైర్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలి చనిపోయాడు. మేకలు మేపడానికి వెళ్లిన బాలూ ఎంత వరకూ రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడానికి వెళ్లారు. ఫెన్సింగ్ తీగలపై పడి ఉండగా గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.. ఎస్.ఐ. సతీశ్ కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.

పన్ను పేచీలుండవ్..

ఆస్తుల రిజిస్ట్రేషన్‌తోపాటే పన్నుల బదలాయింపు - నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం

మునిసిపాల్టీలు, కార్పొరేషన్లలో అమలుకు చర్యలు - 14 కార్పొరేషన్లలో వచ్చే నెల నుంచే..



భీమవరంటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ సేవలను డిజిటలైజేషన్ చేసేందుకు ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పట్టణాలు, కార్పొరేషన్లలో ఆస్థులు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే సంబంధిత వ్యక్తి పేరున ఆస్థి, నీటి పన్నులు మారేందుకు నూతనవిధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ నెల 23న డీఎంఏ సంపత్ కుమార్ విధివిధానాలను విడుదల చేశారు. 2018లో ఈ విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నించారు.కొన్ని సాంకేతిక ఇబ్బందుల వల్ల పూర్తి స్థాయి అమలు జరగలేదు. ప్రస్తుతం ఈ విధానం తీసుకురావడానికి కసరత్తులు చేస్తోంది. ఈ విధానాన్ని విజయవాడ కార్పొరేషన్‌లో పైలెట్ ప్రాజక్టుగా అమలు చేశారు. పురపాలక శాఖ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయంతో ముందుకెళ్తున్నారు. ప్రభుత్వ ఆస్థులకు సంబంధించి, ఆక్రమణ స్థలాల వారికి ఈ విధానంలో మినహాయింపు ఇచ్చారు.

బకాయిలు చెల్లించాలి...

ఈ విధానం అమలు జరగాలంటే సంబంధిత ఆస్థికి సంబంధించి పన్ను బకాయిలు చెల్లిస్తేనే పేరు మార్పు జరుగుతుంది. పేరు మారిన తరువాత ఆస్థికి సంబంధించి పన్ను సక్రమంగా ఉందా లేదా అనేది మునిసిపల్ అధికారులు తనిఖీ చేసి తేడాలుంటే సరిచేస్తారు.

నాలుగు రకాలు ఉంటాయి

ఆస్థిపన్ను అసెస్‌మెంట్ కలిగిన ఇళ్లు, స్థలాలు, ఆస్థి పన్ను అసెస్‌మెంట్, లేని ఇళ్లు, స్థలాలు, ఆస్థి పన్నుకు సంబంధించి అసెస్‌మెంట్ ఉండి సగభాగం విక్రయించిన స్థలం, ఇళ్లు, ఆస్థి పన్నుకు అసెస్‌మెంట్ లేకుండా సగం భాగం విక్రయించడం ఇలా నాలుగు రకాలుగా విభజించారు. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లోనే పేరు మార్పు అమలుకు చర్యలు తీసుకుంటారు.

కలిగే ప్రయోజనం ఇదే..

ఇప్పటి వరకు ఎవరైనా స్థలాలు కొనుగోలు చేసుకుంటే మునిసిపాల్టీల్లో పేరుమార్పుకు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. నూతన విధానం వల్ల మునిసిపాల్టీకి వెళ్లాల్సిన అవసరం ఉండదు. రిజిస్టర్ కార్యాలయంలోనే పేరు మారిపోతుంది. డాక్యుమెంట్‌లో పేర్కొన్న స్థలం వివరాలు, పన్నుల వివరాలు తనిఖీ చేసిన తరువాతనే రిజిస్ట్రేషన్ అధికారులు చర్యలు చేపడతారు.

గతంలో బకాయిలున్నా..

గతంలో పన్ను బకాయిలున్నా రిజిస్ట్రేషన్‌లు జరిగిపోయేవి, దీని వల్ల బకాయిలు చెల్లించేందుకు కొనుగోలుదారులు, వసూళ్లకు మునిసిపల్ అధికారులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వివరాలు సైతం గతంలో మునిసిపాల్టీకి ఆలస్యంగా తెలిసేవి ఇప్పుడు నూతన విధానం ద్వారా రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మునిసిపాల్టీకి సమాచారం అందుతుంది. డబుల్ రిజిస్ట్రేషన్‌లు తగ్గుతాయి.

కార్పొరేషన్ తరువాతే మునిసిపాల్టీల్లో

ఈ నూతన విధానం రాష్ట్రంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి 14 కార్పొరేషన్లలో అమలు చేయనున్నారు. అక్కడ పరిశీలించిన అనంతరం రాష్ట్రంలోని 125 మునిసిపాల్టీల్లో అమలు చేస్తారు. ఈ విధానం అమలుపై ఇప్పటికే మునిసిపాల్టీలకు, కార్పొరేషన్‌లకు సర్క్యులర్‌ను పంపించారు. అయితే ఎంతవరకు విజయవంతమవుతుందో వేచి చూడాల్సి ఉంది.



స.హ. చట్టంపై అవగాహన కల్పిస్తున్న డీసీవో శ్రీనివాస్

స.హ. చట్టం అర్జీలు సకాలంలో పరిష్కరించాలి


● అవగాహన కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్

ఏలూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో సమాచార హక్కుచట్టం కింద అధికారులు అందిన ఫిర్యాదులు, అర్జీలకు సకాలంలో తగు రీతిలో సమాచారం ఇచ్చి తీరాలని జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ సూచించారు. డీసీవో కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల డీఆర్, ఏఆర్, ఇతర సిబ్బందితో స.హ. చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 2005లో వచ్చిన స.హ. చట్టం కింద పౌరులు, ఇతర సంస్థలు, ప్రతినిధులు అడిగిన సమాచారాన్ని పారదర్శకంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వారికి ఇచ్చి తీరాల్సిందేనని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావివ్వొద్దని కోరారు. సహకార శాఖలోని ప్రతీ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డులో అప్పిలేట్ అధికారి సమాచారం, ఫోన్ నెంబర్, ఇతర వివరాలను ప్రదర్శించాలని వివరించారు.సమావేశంలో ఏలూరు, నూజివీడు డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారులు కె.సత్యవతి, రవికుమార్, కార్యాలయం సూపరింటెండెంట్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వందే భారత్‌కు ఏలూరు స్టాప్ మరో ఆరు నెలల పొడిగింపు

ఏలూరు క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు మీదుగా నడుస్తున్న రైళ్లల్లో విశాఖపట్టణం నుంచి సికింద్రాబాద్ - విశాఖపట్టణం నడిసే వందే భారత్ రైలుకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రత్యేక కృషితో ఆ రైలుకు ఏలూరులో స్టాప్ ఇచ్చారు. అయితే ఆరు నెలలు గడువు వరకు మాత్రమే గతంలో స్టాప్‌గా అనుమతినిచ్చారు. ఆ గడువు ముగుస్తుండటంతో అధికారులు మరో ఆరు నెలలు పొడిగింపునకు చర్యలు తీసుకున్నారు. మరో ఆరు నెలలు ప్రయోగాత్మకంగా పరిశీలన చేసేందుకు ఏలూరులో స్టాప్‌ను కొనసాగిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. రైల్ నెంబర్ 20708 విశాఖపట్టణం - సికింద్రాబాద్ రైలు ఆగస్టు 24వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా ఏలూరు స్టాప్‌ను కొనసాగిస్తున్నారు. రైలు నెంబర్ 20708 సికింద్రాబాద్ - విశాఖ పట్టణాన్ని ప్రయోగాత్మకంగా మరో ఆరు నెలలు ఏలూరు స్టాప్‌ను కొనసాగిస్తారు. ప్రయాణికుల రద్దీ, ఆక్యుపెన్సీ ఏలూరు నుంచి ఉంటే స్టాప్‌ను యథావిధిగా కొనసాగిస్తారు.

రాష్ట్ర స్థాయి అండర్-13 చెస్‌కు జెస్సీ ఏంజిల్



ఏంజిల్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీప్తి చెస్ అకాడమీలో ఇటీవల జరిగిన జిల్లా అండర్-13 ఏలూరు జిల్లా బాల, బాలికల చెస్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారిణి జెస్సీ ఎంజిల్ రాష్ట్ర స్థాయి అండర్-13 పోటీలకు ఎంపికైంది. ఆగస్టు 2,3వ తేదీల్లో జరిగే ఈ పోటీలకు జెస్సీ ఏంజిల్ ఏలూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనుంది.

కోనాలలో ఫ్లెక్సీ వివాదం

ఘర్షణ తలెత్తకుండా బందోబస్త్ ఏర్పాటు

తణుకు రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కోనాల గ్రామంలో తలెత్తిన ఫ్లెక్సీ వివాదం రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈఘర్షణ కారణంగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఒక వర్గం శ్రీరాముని ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా మరో వర్గం హీరో సూర్య పుట్టిన రోజు ఫ్లెక్సీని ఏర్పాటు చేసింది. దేవుడి ఫ్లెక్సీ ముందు సినీహీరో ఫ్లెక్సీ పెట్టడం సమంజసం కాదని ప్రశ్నించడంతో వివాదం రాజుకుంది. ఇరు వర్గాలు ఘర్షణకు దిగడంతో రెండు ఫ్లెక్సీలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న తణుకు రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు.



ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ బ్యాంకర్లకు సూచించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో పట్టణంలోని బ్యాంకర్లతో అవగాహన కల్పించారు.బ్యాంకు లోపల, బయట సెక్యూరిటీ, సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వినియోగదారులు అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాలు, ఫిషింగ్‌దాడులు, ఆన్‌లైన్ మోసాలు, డేటా చోరీ వంటి విషయాలపై ప్రస్తావించారు. ఎస్ఐ సతీష్ కుమార్, బ్యాంకర్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

కామవరపుకోట, జూలై 24(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దత్తత ఆలయమైన తూర్పుయడవల్లిలోని రామాలయం వద్ద పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు అళహంగి శేషాచార్యులు బృందం నిర్వహించారు. తొలుత మూల విరాట్‌లకు సీతారామలక్ష్మణ హనుమంతులు వారికి అభిషేకాలు నిర్వహించి అనంతరం ప్రత్యేక హారతులు ఇచ్చి నివేదనలు సమర్పించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

డెంగీ జ్వరాల నియంత్రణకు అవగాహన ర్యాలీ

ఏలూరు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో గురువారం జేపీ కాలనీ అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ నేతృత్వంలో వైద్యసిబ్బంది దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ కారక దోమలు ముఖ్యంగా పగటిపూట కుడతాయని, ఇల్లు ఊడ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జ్వరం, తీవ్రమైన కండరాల నొప్పులు, కనుగుడ్ల నొప్పులువంటి లక్షణాలు డెంగీ అనుమానితంగా పరిగణించవచ్చని, ఇటువంటి లక్షణాలున్నవారు పీహెచ్‌సీలకు వెళ్తే డెంగీ పరీక్షలకు ఉచితంగా చేస్తారని వివరించారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ జే.గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అవగాహన సదస్సు

ఏలూరు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇంటర్ స్థాయిలోనే విద్యార్థుల భవిష్యత్ ప్రణాళిక అనే అంశంపై గురువారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఇంటర్మీడియట్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి గురజాడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్ కెరీర్ ప్రతీ విద్యార్థి జీవితాన్ని దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. సైన్సు, ఆర్ట్స్, కామర్స్ గ్రూపులు చదివిన విద్యార్థులు ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సామర్థ్యానికి అనుగుణంగా విద్యార్థులు మంచికోర్సులను ఎంచుకోవాలన్నారు. కరస్పాండెంట్ కలగర శివరామకృష్ణప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, అధ్యాపకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు : డీఎస్‌వో

జంగారెడ్డిగూడెం,జూలై 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో విలియమ్స్ హెచ్చరించారు. గురువారం రోటరీ క్లబ్ భవనంలో జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల రేషన్ డీలర్లతో డీఎస్‌వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 26 నుంచి 31 వరకు వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటి వద్దకే రేషన్ డీలర్లు సరుకులు తీసుకెళ్లి అందజేయాలన్నారు. ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా రేషన్ పంపిణీపై ప్రజల అభిప్రాయాలను ఎప్పటికప్పుడు సేకరిస్తుందని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి పదిహేనవ తేదీ వరకు జరిగే రేషన్ పంపిణీ వంద శాతం పూర్తి కావాలన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, కొయ్యలగూడెం సీఎస్ డీటీ రామారావు, బుట్టాయగూడెం సిఎస్ ఆర్ఐ పద్మావతి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల రమేష్, డివిజన్ అధ్యక్షుడు పఠాన్ అన్వర్ బాషా పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్



జీలుగుమిల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కుక్కల నుంచి ఎటువంటి హాని కలగకుండా వాటికి యాంటి రేబిస్ ఇంజెక్షన్లు చేశారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం రహదారిపై, గ్రామ వీధుల్లో కుక్కలు 9మందిని గాయపరిచాయి. ఈ క్రమంలో గాయాలపాలైన వారు ఆస్పత్రిలో చికిత్స పొందిన ఓ వృద్ధురాలు ప్రాణాలు వదిలింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో, టి.నిఖిల్ మధు శరణ్, పశు వైద్యశాల సహాయ సంచాలకులు పి.సాయిబుచ్చారావు ఆధ్వర్యంలో వీధి, పెంపుడు కుక్కలను గురువారం పట్టుకున్నారు. అనంతరం వాటిని పశు వైద్యశాలకు తరలించి వ్యాక్సిన్ వేసి విడిచి పెట్టారు. వ్యాక్సిన్ కొరత లేదని సరిపడా వ్యాక్సిన్‌ను తెచ్చినట్లు ఏడీ సాయిబుచ్చారావు తెలిపారు. పంచాయితీ కార్యాదర్శి అశోక్, ఎల్‌ఎస్ఏ సత్యనారాయణ, రాజు, సిబ్బంది ఫరీద్ ఉన్నారు.

రైతులు ప్రకృతి సాగును ప్రోత్సహించాలి

కామవరపుకోట, జూలై 24(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలతో కూడిన దిగుబడులు సాధించేందుకు రైతులంతా ప్రకృతి సాగు పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు శ్రీనివాసరావు, రామ్మోహన్‌రావులు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో గల తోటలను గురువారం పరిశీలించి రైతులతో సమీక్షలు నిర్వహించారు. ఈ మేరకు తడికలపూడిలోని వై.రామారావు పామాయిల్, కోకో తోటలలో జరిపే సేంద్రియసాగును పరిశీలించారు. రత్నగిరి నగర్‌లో జి.ఎన్.వి.ఎస్.ప్రసాద్‌కు చెందిన పామాయిల్ తోటలో బహుళ పంట సాగు, ప్రకృతి వ్యవసాయ పద్ధతిని తనిఖీ చేశారు. కళ్ళచెరువు గ్రామంలో నాగిరెడ్డి వెంకట్రామిరెడ్డికి చెందిన సోలార్ డ్రయర్ పనితీరును పరిశీలించారు. వెళ్ళంకి శ్రీనివాసరావుకు చెందిన సోలార్ కోల్డ్ రూమ్, డ్రాగన్ ఫ్రూట్ సాగు, కొబ్బరిలో బహుళ పంట సాగు క్షేత్రాలను పరిశీలించారు. వారి వెంట రత్నమాల, మండల వ్యవసాయ శాఖాధికారి ముత్యాలరావు ఉన్నారు.

స్కూల్ నుంచి అలిగి వెళ్లిన బాలుడి అప్పగింత

ఏలూరు క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఒక బాలుడు ఒంటరిగా నడిచి వెళ్తుండగా హైవే పెట్రోలింగ్ వాహనం డ్యూటీలో ఉన్న హోంగార్డు ఆ బాలుడిని గమనించి వివరాలు తెలుసుకుని స్కూల్‌కి అప్పగించారు. తాడేపల్లిగూడెం రోడ్డులోని పోలీస్ పెట్రోలింగ్ వాహనం - 5పై హోంగార్డు కె శివ ప్రసాద్ గురువారం ఉదయం డ్యూటీలో ఉన్నాడు. ఓ బాలుడు ఒంటరిగా నడిచి వెళ్తుండడంతో గమనించిన హోంగార్డు తక్షణమే స్పందించి ఆ బాలుడిని పలకరించి తన వాహనంలో కూర్చోబెట్టుకున్నారు. ఆ బాలుడి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.తనది రాజమహేంద్రవరమని చేబ్రోలులో ఉన్న ముస్లిం స్కూల్లో చదువుతున్నానని స్కూలు మాస్టారు కొట్టడంతో అక్కడి నుంచి బయటకు వచ్చి వెళ్ళిపోతున్నానని చెప్పాడు. దీంతో అతని తల్లి దండ్రులకు హోంగార్డు సమాచారం ఇచ్చి బాలుడిని స్వయాన చేబ్రోలు తీసుకువెళ్ళి ముస్లిం స్కూల్లో అప్పగించారు. విధి నిర్వహణలో హోంగార్డు శివ ప్రసాద్ చూపించిన చొరవతో బాలుడిని సురక్షితంగా తిరిగి అప్పగించడంతో పాటు తల్లి దండ్రులకు సమాచారం ఇవ్వడంతో ప్రజలు, అధికారులు అతడిని అభినందించారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఎన్నిక

టి.నర్సాపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి):మండల ఫొటో, విడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గురువారం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షులు మాదాసు శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా గుండే మహారాజు, గౌరవ అధ్యక్షులు పర్సా చందు, కార్యదర్శి పలగాని ప్రసాద్, కోశాధికారి బొమ్మిడి ఈశ్వర్లతో పాటు నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మహారాజులు మాట్లాడుతూ సంఘం సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. యూనియన్ సభ్యులు ఐక్యంగా నూతన కార్యవర్గానికి సహకరించాలన్నారు. జడ్ల మహేశ్, పిచ్చుకల భార్గవ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

టి.నర్సాపురం : రాష్ట్రంలో ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసీపీ యువనాయకులు పెండ్యాల అభిషేక్ బాబు గురువారం విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కొత్తపింఛన్లు ఇవ్వడకుండా వెరిఫికేషన్ పేరుతో ఉన్నపింఛన్లు తొలగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక వైసీపీ నాయకులపై అక్రమకేసులు బనాయిస్తున్నారని దుయ్యబట్టారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పని హెచ్చరించారు.

రైతుకు దక్కని..భరోసా!

(5వ పేజీ తరువాయి)



అంబర్‌పేటలో సగం నిర్మాణంలో నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం భవనం

పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా స్థానాలు కేటాయించారే గానీ, వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సిబ్బందిని ఆయా శాఖల పరిధిల్లోకి మార్పు చేయలేదు.

- భీమడోలు : భీమడోలు మండలంలో గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చిన రైతుసేవా కేంద్రాలను పట్టించుకోక పోవడంతో అవి శిథిలావస్థకు చేరువవుతున్నాయి. మండలంలో 14 రైతు సేవా కేంద్రాలను ప్రస్తుతం 12 కేంద్రాలకు కుదించారు. కొన్ని ప్రభుత్వ పాత భవనాల్లో మరికొన్ని కొత్త భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన గుండుగొలను, అంబర్‌పేట, పూళ్ళల్లోని రైతు సేవా కేంద్రాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ కేంద్రాలలో 12 మంది అగ్రి అసిస్టెంట్లు పని చేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా పంపిణీ చేయాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచడం లేదు.

ఇంకెన్నాళ్లు..

- 16 ఏళ్లుగా రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు
- పట్టించుకునే వారే లేరంటూ ఆవేదన
- బాట గంగానమ్మ లే అవుట్ కాలనీ ప్రజల ఆవేదన



గోతులమయంగా ఉన్న రోడ్లు.. బాట గంగానమ్మ లే అవుట్ కాలనీ

జంగారెడ్డిగూడెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణ శివారులో పేరంపేట రోడ్డులోని బాట గంగానమ్మ లే అవుట్ కాలనీని గత 16 ఏళ్లుగా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, డ్రైన్లు లేక మురుగంతా రోడ్లపైకి పారుతోందని వాపోయారు. వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, రోడ్లు జలమయంగా మారి తాము ఎన్ని కష్టాలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అక్కడి ప్రజలు వాపోతున్నారు.2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 28 ఎకరాల జిరాయితీ భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసి 824మంది జంగారెడ్డిగూడెం పట్టణంలో ఇల్లు లేని వారికి సెంటున్నర చొప్పున ఇంటి స్థలం పంపిణీ చేశారు. కొనుగోలు చేసిన భూమిలో కొంత భాగం జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం రెవెన్యూ పరిధిలో ఉండగా మరికొంత జంగారెడ్డిగూడెం సరిహద్దుల్లో ఉంది. ఇంటి స్థలాలు పొందిన వారంతా పట్టణ వాసులే కావడంతో, గృహ నిర్మాణ శాఖ రుణం మంజూరు చేయడంతో ఇళ్లు నిర్మించుకుని పేదలు నివాసం ఉంటున్నారు.

కాలనీ అభివృద్ధికి ఆటంకం...

కాలనీలో మౌలిక సదుపాయాలను తాము కల్పించలేమని, బాట గంగానమ్మ లే అవుట్ కాలనీని జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరం లేదని తిరుమలాపురం పంచాయతీ బోర్డు 2018లో తీర్మానం చేసింది. అయితే బాట గంగానమ్మ లే అవుట్ కాలనీని జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో కలపాలంటే సీఎం స్థాయి నుంచి ఆదేశాలతో పాటు గెజిట్ నోటిఫికేషన్ రావాలే కానీ సాధారణంగా అయ్యే పని కాదని అధికారులు పేర్కొంటున్నారు. అందుకు ఎమ్మెల్యే నుంచి మంత్రి వరకూ ప్రత్యేక దృష్టి పెట్టి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి టెక్నికల్ సమస్యలు పరిష్కరించి తమ కాలనీని జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో చేర్చి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోలేదు: నీరుకొండ రాము



అప్పటి ఎమ్మెల్యే పీతల సుజాత సహకారంతో కాలనీలోని ఇళ్లకు జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ తరపున ఇంటి నెంబర్లు వేశారు. మంచి నీటి ట్యాంకు నిర్మించారు. 2023లో మున్సిపాలిటీ తరఫున కొంతమేర ప్రధాన రహదారికి సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రెండు పనులు మాత్రమే జరిగాయి. కలెక్టరుకు, ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు వినతులు అందజేశాం.

ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం : ఎమ్మెల్యే రోషన్



ప్రచార పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్

లింగపాలెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బోగోలు, పుప్పాలవారిగూడెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. బొంతు గిరిబాబు, వేంపాటి సత్తిబాబు, తాడేపల్లి దాస్‌బాబు, రాప్రోలు వేణు, రాప్రోలు రామ్మోహన్, బొంతు శేషగిరిరావు, బొంతు సత్యనారాయణ, కొటారి శివయ్య, పి.రామకృష్ణ, ఎం.సునీల్ పాల్గొన్నారు.

● చింతలపూడి:సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీలోని కొప్పుల వారివీధిలో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎవరికి రావడంలేదో తెలుసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధిపై వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయ కులు కొత్తపూడి శేషగిరిరావు, కేతేపల్లి చందు, ఆట్లూరి శ్రీనివాసరావు, కె.హరి, కె.రమేశ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుకార్పొరేషన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ పంచాయతీరాజ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాసడాంగే, పళ్ళెం కిషోర్‌ల బృందం జిల్లా పంచాయతీ అధికారి అనూరాధకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాంగే, కిషోర్‌లు మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు కావడంలేదని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రతి ఎకరాకు నీరందిస్తాం

పెదపాడు, జూలై 24(ఆంధ్రజ్యోతి):సాగులో ఉన్న ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలం పెరికీడు నుంచి కలపర్రు వరకు ఉన్న కృష్ణా కాలువను రైతులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం పరిశీలించారు. కాలువలో జరుగుతున్న తూడు తొలగింపు పనులపై స్థానిక రైతులతో మాట్లాడారు. తూడు, గుర్రపుడెక్క వల్ల సాగు నీటి పారుదలకు ఆటంకం కలుగుతోందన్నారు. రెండ్రోజులు కాలువ నీటిని నిలుపుదల చేసి తూడు తొలగింపు పనులు పూర్తి చేసి సాగు నీరందస్తామన్నారు. పెదపాడు డీసీ అధ్యక్షులు బి.కాశీబాబు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఏలూరుక్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని రూరల్ ఎస్ఐ సి.హెచ్.దుర్గా ప్రసాద్ అన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ దుర్గా ప్రసాద్ పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ క్రైమ్, ఈవ్‌టీజింగ్, మహిళలపై జరిగే దాడులను వివరించారు. ఆపదలో ఉన్న సమయంలో పోలీస్ సహాయం కోసం 112కు కాల్ చేస్తే పది నిముషాల్లో పోలీసులు చేరుకుంటారన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930కు సమాచారం అందించాలన్నారు. సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీటీ స్కాన్, ట్రామాకేర్ ఏర్పాటు చేయాలి

మంత్రికి కరాటం రాంబాబు విజ్ఞప్తి

జంగారెడ్డిగూడెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్, ట్రామాకేర్ విభాగాన్ని త్వరిత గతిన ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను జనసేన పార్టీ నేత, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు కోరారు. గురువారం కరాటం రాంబాబు మంత్రి సత్యకుమార్‌ను కలిసి స్థానిక ఏరియా ఆస్పత్రిలోని సమస్యలను వివరించారు. పట్టణంలోని జాతీయ రహదారిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సరైన సమయంలో వైద్యం అందక ఎంతో మంది చనిపోతున్నారని తెలిపారు. సీటీ స్కాన్, ట్రామాకేర్ విభాగాలు ఏర్పాటు చేస్తే ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రికి వివరించారు. దీంతో మంత్రి సత్యకుమార్ సానుకూలంగా స్పందించి త్వరలోనే ఆయా విభాగాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు కరాటం రాంబాబు తెలిపారు.

గొప్ప సంఘ సంస్కర్త గుర్రం జాషువ

ఏలూరుటూటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): తెలుగు వారు గర్వించదగ్గ గొప్ప సంఘ సంస్కర్త గుర్రం జాషువ అని మాజీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు నేతర అజయ్‌బాబు అన్నారు. ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో గుర్రం జాషువ 53వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ గుర్రం జాషువ ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. అంటరానితనంపై ప్రజల్లో చైతన్యం కలిగించారన్నారు. నేతర అశోక్, జాకబ్, ఎం.నాగరాజు, ఎస్. వీరయ్య, గుర్వయ్య, అబ్రహం, వేణు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి

ఏలూరు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య పంతులు 135వ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఆధునిక విద్య - గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. సామాజిక కార్యకర్త బి.కే.ఎస్.ఆర్.అయ్యంగార్ మాట్లాడుతూ వెంకట రమణయ్య జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని నింపేందుకే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ రామరాజు, వైస్ ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, లైబ్రేరియన్లు గీత, జ్యోతి, రోజాకుమారి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే పీ-4 ప్రోగ్రామ్

జంగారెడ్డిగూడెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకే సీఎం చంద్రబాబు పీ-4 ప్రోగ్రామ్‌కు రూపకల్పన చేశారని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. గురువారం 8,9 సచివాలయాల్లో పీ-4 రీసర్వేను సచివాలయ సిబ్బంది నిర్వహించారు. రావూరి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరవగా ఏరియా ఆస్పత్రి హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుడు నాయుడు శ్రీను పాల్గొన్నారు.

కాటన్‌కు ఘన నివాళి

నిడమర్రు, జూలై 24(ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ కృషితో ఉభయ గోదావరి జిల్లాలు సుభిక్షంగా పాడిపంటలతో వెలుగొందుతున్నాయని భారత్ హ్యాండ్ లూమ్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు పేర్కొన్నారు. గురువారం సర్‌ఆర్థర్ కాటన్ 126వర్ధంతి సందర్భంగా నిడమర్రులో ఆయన విగ్రహనికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ ఇంటి ఉదయబాస్కర్, ఆదపురెడ్డి నాగసీతయ్య, మహ్మద్ అబ్దుల్ వహాబ్, లక్ష్మీ నారాయణ, బి.గణేశ్ పాల్గొన్నారు.

అమావాస్య అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 24(ఆంధ్రజ్యోతి):పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుడి ఆలయం వద్ద ఆషాడ అమావాస్య నేపథ్యంలో గురువారం భక్తులకు సామూహికంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సూర్యనమస్కార పూజలు జరిపారు. ఆలయ అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణశర్మ వనమూలికల తీర్థాన్ని అందించారు.

గిరిజనుల భూములను కొనవద్దు

బుట్టాయగూడెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సాగులో ఉన్న భూములను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో కొనుగోలు చేయవద్దంటూ గురువారం ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రెడ్డిగణపవరం గిరిజనులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో పాల్గొన్న నాయకులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, కారం భాస్కర్, అందుగుల ప్రాన్సిస్ మాట్లాడుతూ రెడ్డిగణపవరం పంచాయతీ జగ్గిశెట్టిగూడెం రెవెన్యూ పరిధిలోని పలు సర్వే నెంబర్లలోని 35.20 ఎకరాల ఎల్.టి.ఆర్. భూములను గిరిజనులు సాగు చేస్తున్నారన్నారు. ఇవే భూములను గిరిజనేతరులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో పెట్టి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని గిరిజనుల సాగులో ఉన్న భూముల కొనుగోళ్లను నిలుపుదల చేయాలన్నారు. భాస్కరావు, ఉనుముల సూర్యచంద్రం, కోర్స జలపాలు, పూనెం దుర్గారావు, యు.బాబురావు, లక్ష్మయ్య, వెంకన్న, నాగమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి తగ్గిన భక్తుల రద్దీ



ద్వారకాతిరుమల, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీపై అమావాస్య తన ప్రభావాన్ని చూపింది. చినవెంకన్న ఆలయానికి ప్రతీ రోజు వేలాదిగా తరలి వచ్చే భక్తులు అమావాస్య కారణంగా, అలాగే ఆషాఢం చివరి రోజు కావడంతో తక్కువ సంఖ్యలో క్షేత్రానికి విచ్చేశారు. అలాగే ఉదయం నుంచి జోరున వర్ష కురవడం కూడా ఓ కారణం. దీంతో క్షేత్ర పరిసరాలు, గ్రామ ప్రధాన రహదారి ఖాళీగా కనిపించాయి.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

దెందులూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి):దెందులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని దెందులూరు 24గంటలు, ఇండస్ట్రియల్, సత్యనారాయణపురం, శ్రీరామవరం, గంగన్నగూడెం, కొత్తగూడెం ఫీడర్లలో మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. ఈ నిమిత్తం శుక్ర, శనివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏలూరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. దెందులూరు సబ్‌స్టేషన్ పరిధిలో దెందులూరు, సత్యనారాయణపురం, అలుగులగూడెం, కొమిరేపల్లి, గంగన్నగూడెం, కొత్తగూడెం పరిసర గ్రామాలకు వ్యవసాయ, గృహవిద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

నిడమర్రు జూలై 24(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవితవ్యం కోసం లయన్స్ క్లబ్ సేవలో ఎల్లప్పుడూ ముందుంటుందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్లంకి నరేష్ కుమార్ అన్నారు. గురువారం నిడమర్రు మండలం సిద్ధాపురం, ఛానమిల్లి, గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 10 వేలు రూపాయలు విలువైన నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ప్రధాన కార్య దర్శి కిలారి రవిబాబు, సత్యనారాయణమూర్తి, ఫణి, ఉపాధ్యాయులు యర్రంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇవ్వని హామీలు కూడా నెరవేర్చాం: చంటి

ఏలూరుటూటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలతో పాటు ఇవ్వని వాగ్దానాలు కూడా నెరవేర్చామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 35వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఏడాది కాలంలోనే ప్రజలు సంతృప్తి చెందే విధంగా పరిపాలన కొనసాగించామని అందుకే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. డివిజన్‌ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బాలాజీ, డివిజన్ అధ్యక్షులు ఈదుపల్లి ప్రసాద్, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

చింతలపూడి, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని, లేదంటే వాటిని ధ్వంసం చేస్తామని విపక్షాలు హెచ్చరించాయి. గురువారం సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలువురు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిందని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపు విధానానికి ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ముట్టడి చేస్తామన్నారు. ఈ నెల 28 నుంచి 31 వరకు మండలంలోని గ్రామాల్లో సంతకాల సేకరణ చేస్తామన్నారు.

● జీలుగుమిల్లి: స్మార్ట్ మీటర్లు పేదలకు భారమని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు.గురువారం జీలుగుమిల్లి సుందరయ్య భవనంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా వామపక్షాల నాయకులు సమావేశం నిర్వహించారు. ప్రజలు రాజకీయాలకతీతంగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు.

● బుట్టాయగూడెం: విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం ఆదాని స్మార్ట్ మీటర్లను తీసుకొచ్చిందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేశ్ పేర్కొన్నారు. గురువారం బుట్టాయగూడెం రామనర్సయ్య భవనంలో జరిగిన ప్రజా సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రతిపక్షంగా ఉన్నపుడు టీడీపీ, జనసేన పార్టీలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారన్నారు. ప్రభుత్వం వ్యాపార ధృక్పథంతో ప్రజలపై దాడి చేస్తున్నట్లు తెలిపారు. ఇదే విధానం కొనసాగితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శనివారం సంతకాల సేకరణ చేపడతామని, ఆగస్టు 5న సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తామన్నారు. నాయకులు తెల్లం రామకృష్ణ, తెల్లం ముసేశ్వరావు, సముద్రాల సుబ్బారావు, కట్టం వీరాస్వామి, కారం భాస్కర్, మొడియం నాగమణి పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల అందజేత

దెందులూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి):స్థానిక బాలికోన్నత పాఠశాలకు టీడీపీ నాయకులు సంపంగి వేణుగోపాల తిలక్, ఇప్పిలి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షులు గారపాటి కొండయ్య చౌదరి 25 కుర్చీలను అందజేశారు. హెచ్‌ఎంలు బొంకిన శారదమ్మ, సంపంగి వెంకటలక్ష్మికి దాతలు ఈ కుర్చీలను అందజేశారు. దాతలు మాట్లాడుతూ అవసరమైన సహాయాన్ని పాఠశాలకు అందిస్తామన్నారు.

ఎమ్మెల్యే చింతమనేని సాయం

పెదవేగి(దెందులూరు), జూలై 24(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం వేగివాడలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన నల్లమెల్లి రాజుకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ 50 కేజీల బియ్యం, రూ.5 వేల నగదు పంపారు. మండూరు సహకార సంఘం బ్యాంక్ అధ్యక్షుడు కొనకళ్ళ శివమణీగౌడ్, సర్పంచ్ పంది పద్మావతి చేతుల మీదుగా వీటిని బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. టీడీపీ నాయకులు భగవాన్, నున్న జానకిరామ్ ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పోలవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ దివంగత నాయకుడు పూనెం వీర వెంకటసత్య రామ్మోహన్ నాలుగవ వర్ధంతి సందర్భంగా ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా గాంధీ స్మారక వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, పోలవరం మాజీ ఎమ్మెల్యే దివంగత పూనెం శింగన్న దొర ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఆయన తనయుడు పూనెం రామ్మోహన్ నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని ఆయన లేకపోవడం తీరనిలోటన్నారు.

దోసపాడుకు సీసీ రోడ్లు

దెందులూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): దోసపాడు గ్రామానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీతో పాటు సిమెంట్, గ్రావెల్ రోడ్లను మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో దోసపాడు సర్పంచ్ యేసోబు, నాయకులు ఎం.వెంకటేశ్వరావు,అత్తులూరి శ్రీనివాసరావు, బొల్లే రాము, గంగరాజు సూచించారు. అనంతరం పలు గ్రామాల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు.

కాగుపాడుకు వితరణ

ఉంగుటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): కాగుపాడు గ్రామానికి చెందిన డాక్టర్ పూదోట సునీత తన తల్లిదండ్రులు గూడపాటి సత్యనారాయణ (పటేల్), భారతి పేరుతో రూ.7 లక్షల విలువైన సీసీ కెమేరాలు, ల్యాబ్ పరికరాలను అందించారు. వీటిని సర్పంచ్ పొట్ల ఏడుకొండలు, గన్ని, ఎమ్మెల్యే ధర్మరాజు, బీజేపీ నాయకురాలు శరణాల మాలతీరాణి గురువారం ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ కడియాల రవి శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగుపాడు పి.హెచ్.సి. వైద్యాధికారిణి, సిబ్బంది, సీసీ కెమేరాల ప్రారంభోత్సవంలో నిడమర్రు సి.ఐ. రజనీకుమార్ పాల్గొన్నారు.

జీవ ఎరువులనే వాడండి

చింతలపూడి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకం తగ్గించి వ్యవసాయంలో జీవన ఎరువులు వాడాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వై.సుబ్బారావు మాట్లాడుతూ పచ్చిరొట్ట వల్ల భూసారం పెరగడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు దిగుమతి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.ముత్తారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పల్లెపల్లెకు పత్సమట్ల

ఉంగుటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలో పల్లె పల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో భాగంగా బొమ్మిడి, వి.ఎ.పురం, కాకర్లమూడి, దొంతవరం, కాగుపాడు, సీతారాంపురం, రాచూరు గ్రామాల్లో సభలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త సూరత్తుల అయ్యప్ప, చేబ్రోలు, బొమ్మిడి సొసైటీల చైర్మన్లు కడియాల రవి శంకర్, మైలవరపు గోపాలకృష్ణ, ఎంపీడీవో రాజ్ మనోజ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

కామవరపుకోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మండలంలో చెరువులు, కుంటలు నిండాయని, చెరువులు, కుంటల వద్ద రాకపోకలు సాగించే తరుణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు లైసెన్సులు వెంట తెచ్చుకోవాలని, లేదంటే కేసులు పెడతామని తడికలపూడి ఎస్ఐ చెన్నారావు హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు సెంటర్లలో వాహనదారుల రికార్డులను పరిశీలించి కేసులు నమోదు చేశారు.



కాలసర్ప దోష నివారణ పూజలు

చాట్రాయి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆషాడ అమావాస్య సందర్భంగా చాట్రాయి షిర్డిసాయి ఆలయంలో గురువారం కాలసర్పదోష నివారణ పూజలు నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్య సేవలకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీ

చాట్రాయి, జూలై 24(ఆంధ్రజ్యోతి): చాట్రాయి గ్రామానికి చెందిన తుమ్మల లక్ష్మీదేవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయవాడ ప్రైవేట్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమె కుటుంబ సభ్యులు మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి మెరుగైన వైద్యానికి సాయం అందించాలని కోరారు. సీఎంఆర్ఎఫ్ నుంచి రూ 2.50 లక్షలు ఎల్‌వోసీని మంజూరు చేయించారు. జనసేన నాయకుడు పాశం నాగబాబు గురువారం విజయవాడ హాస్పిటల్‌కు వెళ్లి లక్ష్మీదేవి కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కాలువలు బాగు చేయండి

పెదగొన్నూరు డీసీ సమావేశం తీర్మానం



సమావేశంలో చైర్మన్ సురేష్, డీఈఈ శిరీష

ముదినేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వరి సాగుకు రైతులకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, పంట కాలువల్లో గుర్రపు డెక్కను తొలగించాలని పెదగొన్నూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ సమావేశం తీర్మానించింది. క్యాంప్ బెల్ కెనాల్ వడాలి సెక్షన్ కార్యాలయంలో డీసీ కమిటీ చైర్మన్ గుడిసేవ సురేష్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో కాలువ సమస్యలపై చర్చించారు. గుర్రపు డెక్క, తూటుకాడ నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్నాయని, బ్రాంచి కాలువల్లో నీరు సాఫీగా ప్రవహించే అవకాశం లేదని పలువురు నీటి సంఘాల అధ్యక్షులు డీఈఈ శిరీషకు తెలిపారు. గుర్రపు డెక్క తొలగింపునకు నిధులు మంజూరు చేసి, బిల్లులు చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని చేవూరు నీటి సంఘం అధ్యక్షుడు శాయిన ప్రసాదరావు కోరారు. క్యాంప్ బెల్ ప్రధాన పంట కాల్వ గట్లు చినగొన్నూరు యూటీ నుంచి కూరాడ శివారు వరకు బలహీనంగా ఉన్నాయని, పటిష్టం చేసే పనులను సార్వా సీజను అనంతరం చేపట్టేందుకు ఇప్పటి నుంచే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రస్తుతం గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ పోతుమూడి సోమేశ్వరరావు కోరారు. సమావేశంలో నీటి సంఘాల అధ్యక్షులు కేనం ప్రసాద్, సీతారామయ్య, పోతురాజు రామకృష్ణ, ఏఈ సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ముసునూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ప్రశాంతి అన్నారు. గోపవరం శివారు పెద్దపాటి వారిగూడెంలో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలం వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమ తెరలు వాడాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని ప్రజలకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగానమ్మకు ప్రత్యేక పూజలు

మండవల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా మండవల్లిలో గంగానమ్మ అమ్మవారికి శుక్రవారం నుంచి విశేష పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. 27న అమ్మవారికి ఆధ్వర్యంలో ఘనంగా సారె సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని, అమ్మవారికి జలాభిషేకం చేయడనాకి భక్తులు ఇంటి వద్ద నుంచి కలశాలతో జలం తీసుకోని రావాలని నిర్వాహకులు సూచించారు. కైకలూరు సందు నుంచి ఉదయం 8.30 గంటలకు భక్తులతో బయల్దేరి అమ్మవారికి సారె సమర్పించన్నామని, ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారని కోరారు.

స్నానానికి కాలువలో దిగి..

నీటి ఉధృతికి కొట్టుకుపోయిన వృద్ధుడు

ముదినేపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్నానం చేయడానికి కాలువలో దిగిన వృద్ధుడు నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. కాకరవాడ గ్రామంలో గురువారం ఉదయం మృతి చెందిన ఒక మహిళ దహన సంస్కారాల అనంతరం కుటుంబ సభ్యులంతా పక్కనే పంట కాలువలో స్నానానికి వెళ్లారు. వారితో పాటు అదే గ్రామానికి చెందిన మరీదు వెంకటేశ్వరరావు (62) కాలువలోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకు పోయాడు. వర్షాల వల్ల కాల్వలో నీటి ప్రవాహం గట్ల అంచులను తాకుతూ ప్రవహిస్తుండ డంతో ఆ వృద్ధుడిని రక్షించేందకు అవకాశం లేకుండా పోయింది. అతడి ఆచూకీ కోసం కాల్వ వెంబడి గురువారం రాత్రి వరకు గాలించారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ఆగిరిపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెక్కలం గొల్లగూడెం సుందరయ్య నగర్‌కి చెందిన మల్లంపల్లి వీరకుమార్ (28) ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఈనెల 17న భార్య ప్రసన్నతో అతనికి ఘర్షణ జరిగింది. ఆమె వట్టిగుడిపాడులోని పుట్టింటికి వెళ్లిపోవడంతో వీర కుమార్ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.

చెరువుల సరిహద్దు తగాదా నేపథ్యంలో దాడి

ముదినేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి):పెదగొన్నూరులో చేపల చెరువుల సరిహద్దు వివాదం దాడికి దారితీసింది. గ్రామానికి చెందిన శ్రవణం పూర్ణచంద్రరావు లీజుకు తీసుకున్న చేపల చెరువు గాట్ల పనులు చేసుకుండగా సరిహద్దు చెరువు లీజుదారు గోపు సురేష్ వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అదే రోజు రాత్రి 10.30 గంటలకు పూర్ణచంద్రరావు తన కారులో సింగరాయపాలెం నుంచి పెదగొన్నూరు ఇంటికి వస్తుండగా సురేష్ అతని తండ్రి శివరామకృష్ణ మార్గమధ్యంలో కారును ఆపే ప్రయత్నం చేశారు. పూర్ణచంద్రరావు కారును ఆపి పక్కనే ఇంటిలోకి వెళ్లిపోయాడు. శివరామకృష్ణ, అతని కుమారుడు కర్రలతో కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీనిపై పూర్ణ పోసులకు ఫిర్యాదుతో ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

చదువులు దూరం!

- ముదినేపల్లి మండలంలో యూపీ పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలుగా కుదింపు
- 9 కి.మీ దూరంలో ఉన్నత పాఠశాలలు
- గ్రామీణ విద్యార్థుల పాట్లు
- ఎస్ఎంసీల తీర్మానం బుట్టదాఖలు..!

ముదినేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో ఉన్నత విద్య ఆ విద్యార్థులకు దూరాభారమైంది. ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మండలంలో ప్రాథమికోన్నత పాఠశాలలను బేసిక్ ప్రైమరీ పాఠశాలల స్థాయికి తగ్గించారు. దీనితో పలు గ్రామాల విద్యార్థులు 9 కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తొమ్మిది యూపీ పాఠశాలలు డిగ్రేడ్ అయి బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారాయి. ఆయా పాఠశాలల్లో 6,7,8 తరగతులు ఒక్కసారిగా రద్దయ్యాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనతో కోడూరు యూపీ పాఠశాలను యధాతథంగా కొనసాగిస్తున్నారు. మిగిలిన 8 యూపీ పాఠశాలల్లో విద్యార్థులు 6,7,8 తరగతులకు 4 నుంచి 9 కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలలకు వెళుతున్నారు. కనీసం బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో పలు గ్రామాల విద్యార్థులు ఆటో, వ్యాన్, సైకిళ్లపై దూర ప్రాంతాల్లోని స్కూల్‌కు వెళ్లడం తీవ్ర ఇబ్బందిగా ఉంది.

ఎస్ఎంసీ తీర్మానాలకు విరుద్ధంగా..

మండలంలో యూపీ పాఠశాలల స్థాయి కుదింపు ఆయా పాఠశాలల ఎస్ఎంసీలు వ్యతిరేకిస్తూ తీర్మానించాయి. ఒకటి నుంచి ఎనిమిది తరగతుల కొనసాగించాలని ఎస్ఎంసీ సమావేశాల్లో తీర్మానించి జిల్లా విద్యాశాఖ అధికార్లకు ముందుగానే పంపించారు. తీర్మానాలను బుట్టదాఖలు చేస్తూ ఆయా పాఠశాలలను ప్రాథమిక పాఠశాలగా కుదించారు. ఎస్ఎంసీల అంగీకారం మేరకు పాఠశాలలను డీగ్రేడ్ చేశామని అధికారులు చెప్పడం శోచనీయం. డీగ్రేడేషన్‌పై నిరసన నేపథ్యంలో ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఎంసీ, తల్లిదండ్రుల సమావేశాలను ఎంఈవో-2 నిర్వహించారు. డీగ్రేడ్ అయిన అన్ని యూపీ పాఠశాలలను 8వ తరగతి వరకు కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. వాటిపై అధికార్లు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



వ్యాన్‌లో పెదగొన్నూరు హైస్కూల్‌కు వెళుతున్న వణుదుర్రు విద్యార్థులు

విద్యార్థుల అవస్థలు!

మండలంలోని దాకరం యూపీ పాఠశాల నుంచి 46మంది విద్యార్థులు జాతీయ రహదారి వెంబడి 4 కిలోమీటర్ల దూరంలో ముదినేపల్లి హైస్కూలుకు, వణుదుర్రు నుంచి 15 మంది విద్యార్థులు వ్యాన్‌లో 6 కిలోమీటర్ల దూరంలోని పెదగొన్నూరు, 10 మంది విద్యార్థులు అధ్వాన రోడ్డుపై సైకిళ్లపై 6 కిలోమీటర్ల దూరంలోని మల్లపురాజుగూడెం, చినకామనపూడి విద్యార్థులు 24 మంది లింగాల, చిగురుకోట, వడాలి హైస్కూళ్లకు, చేవూరు, కాకరవాడ, దేవపూడి వాడవల్లి, కోరుకొల్లు, మల్లపరాజుగూడెం హైస్కూళ్లకు వెళ్లి వస్తున్నారు.



కృష్ణారావుపాలెంలో రోడ్డుపై గుంత పూడ్చివేత



వరహాపట్నంలో డ్రెయిన్ మరమ్మతు పనులు



మూల్లంక రహదారిపై గుంతల పూడిక పనులు

ముంపు ముప్పు లేకుండా..

రహదారి, డ్రెయిన్ మరమ్మతులు

చాట్రాయి, జూలై 24(ఆంధ్రజ్యోతి):వర్షాలతో రహదారులు మునుగుతున్నాయి. గోతుల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. విజయవాడ-సత్తుపల్లి రహదారిలో కృష్ణారావుపాలెం వద్ద రోడ్డుపై గుంతను గురువారం ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చారు. సుమారు 15 రోజుల్లో గుంత వద్ద 10 మంది ద్విచక్రవాహన చోదకులు పడి గాయపడ్డారు. చాట్రాయి ఎస్సై రామకృష్ణ ఇటీవల గుంత వద్ద బారికేడ్స్ ఉంచి రక్షణ చర్యలు తీసుకున్నారు. గుంత పూడ్చివేతపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముంపు నివారణ చర్యలు

కైకలూరు: వర్షాకాలంలో రహదారి ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వరహాపట్నం సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి అన్నారు. గురువారం కైకలూరు మండలం వరహాపట్నంలో నాలుగురోడ్ల కూడలిలో డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టారు. ప్రధాన సెంటర్ కావడంతో నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఎక్కడికక్కడ గ్రామం అంతా డ్రెయిన్ల ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉప్పలపాటి జయదేవకుమార్, బోయిన ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

కలిదిండి: పెద్ద గోతులతో అధ్వానంగా ఉన్న మూల్లంక - పెదలంక ఆర్ అండ్ బి రోడ్డు మరమ్మతుల పనులను రైతులు స్వచ్ఛందంగా గురువారం చేపట్టారు. వీహెచ్‌సీ సమీపంలో రహదారిపై గోతుల్లో పడి ఆటో బోల్తా పడడంతో రైతులు స్పందించారు. గోతుల్లో నీటిని తొలగించి కంకరతో పూడ్చుతున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా మూల్లంక నుంచి పెదలంక, మద్వానిగూడెం నుంచి మట్టగుంట వయా పెదలంక వరకు రహదారి మరమ్మతులు చేస్తున్నామని రైతులు తెలిపారు. పాలకులు, అధికారులు స్పందించి మూల్లంక - పెదలంక రహదారికి, మట్టగుంట - పెదలంక రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు రహదారి మరమ్మతు పనులను పర్యవేక్షించారు.



విద్యార్థుల సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

చాట్రాయి, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల జోలికి వెళితే భవిష్యత్ నాశనమవుతుందని డీఎస్పీ ప్రసాద్ అన్నారు. చనుబండలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులలో న్యాయ అవగాహన, సామాజిక బాధ్యత చైతన్యం ఉండాలన్నారు. పోక్సో చట్టం, సైబర్ నేరాలు, ఫోన్ స్కామ్స్, బాల్య వివాహాలు మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రూరల్ సీఐ రామకృష్ణ, చాట్రాయి ఎస్సై డి రామకృష్ణ, హెచ్ఎం వెంకట్రామయ్య, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కైకలూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ అన్నారు. కైకలూరు జడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శక్తి యాప్, సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, సోషల్ మీడియా వల్ల అనర్థాలను వివరించారు. ఆన్‌లైన్‌లో డిస్కౌంట్ ధరలకు వచ్చే వస్తువులకు ఆశపడి డబ్బు చెల్లించి మోసపోతున్నవారు ఎక్కువవుతున్నారని, ఆన్‌లైన్ కొనుగోలు మంచిది కాదన్నారు. విద్యార్థినులు ఫోన్ నెంబర్లు ఇతరులకు ఇవ్వడం, వెబ్‌సైట్లలో పెట్టడం వంటివి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్ శ్రీను, హెచ్‌ఎం కె.విష్ణుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



అక్కిరెడ్డిగూడెంలో కరపత్రాలను ఇస్తున్న టీడీపీ నాయకులు



కమ్మూరులో టీడీపీ నాయకులకు సత్కారం

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం

ముసునూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు అన్నారు. అక్కిరెడ్డిగూడెంలో బర్మా శ్రీనివాసరావు, బీసీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి టీడీపీ కార్యక్రమం జరిగింది. ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, సమస్యలను తెలుసుకున్నారు. రఘుబాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ విధ్వంస పాలనతో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనక్కి వెళ్లిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏడాదిలో ప్రజల మన్నన పొందిందన్నారు. యలమంచలి శ్రీకాంత్, మల్లిబాబు, పులిబళ్ళ సత్యనార యణ, ఊలన శ్రీనివాసరావు, నందిపాము అచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

తొలి అడుగు కార్యక్రమం నూరు శాతం

ఆగిరిపల్లి: కమ్మూరు 284 బూత్, కృష్ణవరం 283 బూత్‌ల పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నూరు శాతం పూర్తి చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు ఆధ్వర్యంలో దోమ రత్నరాజు, తట్టుకోళ్ల ఆదినారాయణ, మాదల రాజేష్, తట్టుకూరి బిక్షాలను సత్కరించారు. టీడీపీనేత నెరుసు సతీష్, మండల ప్రధాన కార్యదర్శి కొల్లిపర సాంబశివరావు, దొండపాటి ఏసుపాదం, క్లస్టర్ ఇన్‌చార్జి జన్యువుల రాజశేఖర్, యూనిట్ పొన్నం శ్రీనివాసరావు, వీరబత్తిన జోషి, మాజీ సర్పంచ్ మసిముమ్మకు గంగరాజు, అప్పారావు, నడ్డా వీరయ్య, వీరబత్తెన దేవరత్నం, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డైట్ అధ్యాపకులు జోజిబాబు

విద్యార్థులకు ఉత్తమ బోధనలు అందించాలి

ముసునూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని సంసిద్ధత మానిటరింగ్ అధికారి, డైట్ అధ్యాపకుడు ఎన్.జోజిబాబు అన్నారు. ముసునూరు హైస్కూల్, ఎంపీపీ మెయిన్ పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. టెస్ట్ ఫలితాలు, విద్యార్థుల నమోదు, విద్యార్థి మిత్ర క్విట్లు పంపిణీ, పాఠశాలల్లో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలను సంధించి, వారిలోని అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సులభతరమైన బోధనతో విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు డి.శైలజ, కె.రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగంలో ప్రథమ స్థానంలో నిలవాలి

ముసునూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో నిర్వహిస్తున్న ప్రతి కార్యాక్రమాన్ని సక్రమంగా నిర్వహించి మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపాలని ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు జీవీ.రత్నం, ప్రధాన కార్యదర్శి కె.బాబురావు కోరారు. ఎంఈవో-1 రామ్మూర్తిని ఎస్‌టీయూ, డీపీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం సన్మానించారు. ఎస్‌టీయూ సీనియర్ నాయకులు సాయిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో కొత్త స్థానంలో చేరిన ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ వివరాలను త్వరగా పొందుపరచి వారి జీతాలను అందజేయాలని ఆయన కోరారు. ఎంఈవో-2 బీవీఎస్.సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు డి.భాస్కర్, డీపీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జి.ఉదయ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సత్కారం

మండవల్లి జూలై 24(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో ఎల్టీ సురేష్ సేవలు మరువలేనివని వైద్యాధికారులు అన్నారు. మండవల్లి పీహెచ్‌సీ, తక్కెళ్లపాడు పీహెచ్‌సీ పరిధిలోని లోకుముడి వెల్‌నెస్ సెంటర్లో ల్యాబ్ టెక్నీషియన్ బద్దుల సురేష్ విజయవాడలోని చుట్టుగుంట మలేరియా డిపార్ట్మెంట్‌కు బదిలీ అయ్యారు. ఆయనను వైద్యులు సుమ, జోషిమ్మ పూలమాలలు, శాలువాలతో గురువారం సత్కరించారు.

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన అవసరం

కైకలూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై విద్యార్థులకు అవగాహన అవసరమని ప్రిన్సిపాల్ వై.శ్రీలత అన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రక్తదానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారని విద్యార్థులు, యువత రక్తదానం చేయాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, హరిప్రసాద్, ఎం విజయకుమార్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ముదినేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరులో ఇటీవల మరణించిన హేమంత్ కుటుంబానికి తేజస్విని ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. బత్తుల రాము తన కుమార్తె తేజస్విని పుట్టినరోజు సందర్భంగా రూ.3 వేల చెక్‌ను హేమంత్ కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. రాజనాల పవన్, ముగ్గుల నాగబాబు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వైష్ణవి సాయం

ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెంలో కిడ్నీ వ్యాధితో మరణించిన జి.సుబ్రహ్మణ్యం అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి గురువారం రూ.5 వేల ఆర్థిక సహాయంజేశారు. ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ సహాయం అందజేశారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల పాట్లు



- ప్రభుత్వ కళాశాలలో హాస్టల్ సౌకర్యం లేదు
- దూరప్రాంత విద్యార్థులకు ఆర్థిక భారం

కలిదిండి, జూలై 24(ఆంధ్రజ్యోతి):కలిదిండిలో ఎన్టీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. దూర ప్రాంత విద్యార్థులు ప్రైవేట్ హాస్టల్‌లో ఉండడం ఆర్థిక భారమైంది. కళాశాలలో అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారు. ఉత్తమ విద్యాబోధనతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉంది. ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న యాసిన్ 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో వెయ్యికి 995 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించాడు. ఇతర ప్రాంతాల విద్యార్థులకు రూముల అద్దె, మెస్ చార్జీలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు కళాశాలలో చేరడానికి వెనుకడుగు వేస్తున్నారు.

ఈ ఏడాది హాస్టల్ సౌకర్యం లేదని 40 మంది విద్యార్థులు వెనుతిరిగి వెళ్లిపోయారు. రూముల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు సుమారు రూ.6 వేలకుపైగా ఖర్చవుతోంది. ఏడాదికి రూ.60 వేల నుంచి 70 వేలు వరకు ఖర్చు కావడంతో తల్లిదండ్రులు కూడా విముఖత చూపుతున్నారు. కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలు తగ్గుతున్నాయి. మొత్తం 120 మంది విద్యార్థులకు 60 మంది ఉన్నారు. ప్రథమ సంవత్సర ప్రవేశ ప్రక్రియ పూర్తి కావస్తున్నా విద్యార్థులు ఎంత మంది చేరతారనేది ఇప్పటికీ స్పష్టత లేదు. ఇతర ప్రాంతాల విద్యార్థులు హాస్టల్ లేదని వెనుదిరుగుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఇటీవల రూ.8 కోట్లతో నూతనంగా విశాలమైన ప్రదేశంలో సువిశాల భవనాలు నిర్మించారు. జూన్ 21 నుంచి విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే హాస్టల్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూమ్, మెస్ చార్జీలు భారం



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు హాస్టల్ లేకపోవటంతో రూమ్, మెస్ ఛార్జీలు నెలకు రూ.6 వేలకు పైగా ఖర్చవుతుంది. మా నాన్న చనిపోవటంతో మా అమ్మ భవన నిర్మాణ కార్మికురాలుగా పని చేసి చదివిస్తోంది. హాస్టల్ సౌకర్యం ఉంటే నాలాంటి పేద విద్యార్థులకు వెసులుబాటుగా ఉంటుంది.

కె.తులసీరావు, ఫైనల్ ఇయర్, బరంపూర్, ఒడిశా

హాస్టల్ ఏర్పాటు చేయాలి



మెస్ చార్జీలను చెల్లించలేక రూములో నలుగురు కలసి వంట చేసుకుంటున్నాం. రూము అద్దె షేర్ చేసుకుంటున్నాం. కనీసం రూము అద్దె నెలకు రూ.6 వేలు వరకు ఉంది. వ్యవసాయ కూలిగా పని చేస్తూ తల్లిదండ్రులు చదివిస్తున్నారు. హాస్టల్ ఏర్పాటు చేస్తే ఆర్థిక భారం తగ్గుతుంది.

ఎం.మధు, ఫైనల్ ఇయర్, విశాఖపట్టణం

హాస్టల్ లేక విద్యార్థులు తగ్గారు



హాస్టల్ లేకపోవటంతో విద్యార్థులు చేరడం లేదు. విద్యా బోధన బాగున్నా మెస్ చార్జీలు, రూము అద్దెలు చెల్లించలేక పేద, మధ్య తరగతి విద్యార్థులు సతమతమవుతున్నారు. స్థానిక విద్యార్థుల కంటే ఇతర ప్రాంతాల వారు అధికం. హాస్టల్ ఏర్పాటు చేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

ఎస్.సుధీర్ కుమార్, రెండవ సంవత్సరం, తాడేపల్లిగూడెం

రైతుకు దక్కని..భరోసా!



చాట్రాయిలో రైతుసేవా కేంద్రం

(5వ పేజీ తరువాయి)

పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా స్థానాలు కేటాయించారే గానీ, వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సిబ్బందిని ఆయా శాఖల పరిధిల్లోకి మార్పు చేయలేదు.

భీమడోలు: భీమడోలు మండలంలో గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చిన రైతుసేవా కేంద్రాలను పట్టించుకోక పోవడంతో అవి శిథిలావస్థకు చేరువవుతున్నాయి. మండలంలో 14 రైతు సేవా కేంద్రాలను ప్రస్తుతం 12 కేంద్రాలకు కుదించారు. కొన్ని ప్రభుత్వ పాత భవనాల్లో మరికొన్ని కొత్త భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన గుండుగొలను, అంబర్‌పేట, పూళ్లల్లోని రైతు సేవా కేంద్రాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ కేంద్రాలలో 12 మంది అగ్రి అసిస్టెంట్లు పని చేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా పంపిణీ చేయాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచడం లేదు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	